ఎడిటోరియల్ డైరెక్టర్స్: విద్యాసాగర్ కాసోజు, సాగర్ బిజిలి
www.vasthavadarpanam.com
# వాస్తవ దర్పణం
తెలుగు దిన పత్రిక
ఎడిటర్: మహమ్మద్ జక్రియా
శుక్రవారం 11.09.2026
https://epaper.vasthavadarpanam.com




# పంచాయతీల నిధులు సొంత ఖాతాల్లోనే!

- గ్రామ అవసరాలకు సకాలంలో ఖర్చు
- పంచాయతీరాజ్ చట్ట సవరణ
- ఉభయ సభల్లో ఏకగ్రీవ ఆమోదం
- 2018లోని సెక్షన్ 70 లోని సబ్ సెక్షన్ 3 కు సవరణ
- గ్రామసభ తీర్మానంతో నిధుల వినియోగం
- చట్ట సవరణతో పంచాయితీల్లో అభివృద్ధి వేగవంతం
- పల్లెలే దేశానికి పట్టుగొమ్మలు: మంత్రి సీతక్క

వాస్తవదర్పణం, స్టేట్ బ్యూరో

**హైదరాబాద్, సెప్టెంబర్ 10:** గ్రామ పంచాయతీలకు సొంత ఆదాయం నేరుగా అందుబాటులో ఉండేలా తెలంగాణ పంచాయతీరాజ్ చట్టాన్ని సవరించే బిల్లుకు శాసనసభ గురువారం ఏకగ్రీవంగా ఆమోదం తెలిపింది. ఇప్పటికే శాసనమండలి ఆమోదం పొందిన ఈ బిల్లుతో గ్రామ పంచాయతీలు తమ సొంత ఆదాయాన్ని ప్రభుత్వ ట్రెజరీలో జమ చేసి, తిరిగి డ్రా చేసుకునే ప్రక్రియకు బదులుగా నేరుగా పంచాయతీ బ్యాంకు ఖాతాలో జమ చేసుకునే వెసులుబాటు కలగనుంది. బుధవారం మంత్రి సీతక్క ప్రవేశపెట్టిన తెలంగాణ పంచాయతీరాజ్ చట్ట సవరణ బిల్లుపై గురువారం సభలో చర్చ అనంతరం ఏకగ్రీవంగా ఆమోదం లభించింది. ఈ సందర్భంగా సీతక్క మాట్లాడుతూ.. "పల్లెలే దేశానికి పట్టుగొమ్మలు. పట్నాలకు వెళ్లినా పల్లెలు పిలుస్తూనే ఉంటాయి. పల్లెకు వెళ్తే తల్లి ఇంటికి వెళ్లినంత సంతోషం కలుగుతుంది" అని అన్నారు.

**గ్రామ అవసరాలకే సొంత ఆదాయం**

తెలంగాణ పంచాయతీరాజ్ చట్టం-2018లోని సెక్షన్ 70లోని సబ్ సెక్షన్ 3కు సవరణ తీసుకొచ్చినట్లు మంత్రి

మిగతా 2






# బీఆర్ఎస్‌పైనే వ్యతిరేకత!

## అసెంబ్లీ ఘటనలపై ఫ్లాష్ సర్వే..

- ప్రభుత్వంపై పెద్దగా వ్యతిరేకత లేదన్న రేవంత్‌రెడ్డి
- సభను అడ్డుకునేందుకే ఫామ్‌హౌస్‌లో వ్యూహం
- ఎమ్మెల్యేల పనితీరే గెలుపు-ఓటములకు కీలకం
- సభకు పూర్తిస్థాయిలో హాజరుకావాలని దిశానిర్దేశం

వాస్తవదర్పణం, స్టేట్ బ్యూరో

**హైదరాబాద్, సెప్టెంబర్ 10:** తెలంగాణ అసెంబ్లీ వేదికగా అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ మధ్య రాజకీయ వివాదం మరింత వేడెక్కింది. గురువారం అసెంబ్లీ కమిటీ హాల్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన కాంగ్రెస్ శాసనసభా పక్ష సమావేశంలో ఇటీవల అసెంబ్లీ వద్ద చోటుచేసుకున్న పరిణామాలు, ప్రతిపక్షాల వ్యవహార శైలి, ప్రభుత్వ భవిష్యత్ వ్యూహంపై కీలకంగా చర్చించారు. ఈ సందర్భంగా గత మూడు రోజులుగా రాష్ట్రవ్యాప్తంగా జరిగిన పరిణామాలపై రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించినట్లు చెబుతున్న ఓ ఫ్లాష్ సర్వే ఫలితాలను సీఎం రేవంత్ రెడ్డి ఎమ్మెల్యేల ముందు ప్రస్తావించినట్లు తెలుస్తోంది. అసెంబ్లీ వద్ద జరిగిన ఘటనలపై ప్రభుత్వం.. ఫ్లాష్ సర్వే చేయించిందని సీఎం రేవంత్‌రెడ్డి సమావేశంలో తెలిపారు. ఆ సర్వేలో రాష్ట్ర ప్రభుత్వంపై పెద్దగా వ్యతిరేకత కనిపించలేదని.. బదులుగా బీఆర్ఎస్ నేతల వ్యవహారశైలినే ప్రజలు తప్పుబట్టినట్లు తేలిందని ఆయన పేర్కొన్నారు. ఈ నెల 7వ తేదీన అసెంబ్లీ గేటు వద్ద చోటుచేసుకున్న పరిణామాలు, స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన వివాదం.. ఎర్రవల్లిలో చోటుచేసుకున్న శుద్ధీకరణ కార్యక్రమం వంటి అంశాలను సీఎం రేవంత్ రెడ్డి ఈ సమావేశంలో ప్రస్తావించారు. ఈ ఘటనలపై ప్రభుత్వం తీసుకున్న చర్యలను కూడా ఎమ్మెల్యేలకు

మిగతా 2

# రాష్ట్రంలో అనుముల బ్రదర్స్ రాజ్యం




## కన్నుపడితే ఏ భూమైనా ఖతం

- షెల్ కంపనీకి భూ కెటాయింపు అక్రమం
- సోదురుడి కోసమే18 గంటల పనిగంటలు
- ఉద్యోగిలేరు..లక్ష మూలధనం, 200 కోట్ల భూమి
- హామీల ఊసేలేదు, గ్యారంటీలు గాలిలోకి
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్


వాస్తవదర్పణం స్టేట్‌బ్యూరో

**హైదరాబాద్, సెప్టెంబర్10 :** తెలంగాణ రాష్ట్రంలో అనుముల బ్రదర్స్ రాజ్యాం నడుస్తోందని,కన్నుపడితే ఏ భూమైనా ఖతం అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఎద్దేవ చేశారు. 18 గంటలు పని చేస్తున్న సీఎం రేవంత్ రెడ్డి ప్రజాభివృద్ధి కోసం కాదని కేవలం సోదరుల లబ్దీకోసమే అని ఆయన వెల్లడించారు.అనుముల సోదరుడికి కేటాయించిన భూమిని బీఆర్ఎస్ నేతలతో కలిసి గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కేవలం ప్రభుత్వం వైఫల్యాన్ని ఎండ గట్టుతారని భయంతోనే తమ ఎమ్మెల్యేలను సభ నుంచి సస్పెండ్ చేశారని వివరించారు.

**సోదరుల లబ్దికోసమే..**

ఆ 18 గంటల కష్టం తెలంగాణ ప్రజల కోసమా లేక తన స్వంత సోదరులు,వారి బినామీ షెల్ కంపెనీల లబ్ధి కోసమా అని నిలదీశారు.రాష్ట్రంలో కేవలం రూ.లక్ష మూలధనంతో స్టార్టప్ ప్రారంభించగా, ఒక్క ఉద్యోగి లేని కంపనీకి రెండు వందల కోట్ల విలువైన ఐదు ఎకరాల భూమిని ఎలా కెటాయిస్తారని నిలదీశారు.తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వమే నేరుగా ఇజ్రాయెల్ కంపెనీలతో లావాదేవీలు నడుపుతోందని

మిగతా 2



# నీళ్లు ఉండి ఎత్తలేని దద్దమ్మ ప్రభుత్వం!

- ఇది కాలం తెచ్చిన కరువు కాదు.. రేవంత్‌రెడ్డి తెచ్చిన కరువు
- ఏపీకి నీళ్లు ఫుల్.. తెలంగాణ రైతులకు నీళ్లు నిల్లు
- ఏపీకి 35 టీఎంసీలు.. తెలంగాణకు 7 టీఎంసీలే!
- మోటార్లన్నీ ఆన్ చేసి పంటలకు సాగునీరు ఇవ్వాలి
- ఆర్ఎస్ఎల్పీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్‌రావు

వాస్తవదర్పణం స్టేట్ బ్యూరో

**హైదరాబాద్, సెప్టెంబర్ 10:** కృష్ణా జలాలు అందుబాటులో ఉన్నా తెలంగాణ రైతులకు సాగునీరు అందించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని బీఆర్ఎస్ఎల్పీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, మాజీ మంత్రి హరీశ్‌రావు తీవ్రంగా విమర్శించారు. "ఇది కాలం తెచ్చిన కరువు కాదు.. రేవంత్‌రెడ్డి తెచ్చిన కరువు. కళ్లముందే నీళ్లు పారుతున్నా పొలాలకు ఇవ్వలేని దద్దమ్మ ప్రభుత్వం" అంటూ మండిపడ్డారు. గురువారం తెలంగాణ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. పాలమూరు బిడ్డనని చెప్పుకునే ముఖ్యమంత్రి కృష్ణా నీటిని ఎత్తకుండా ఆ ప్రాంత రైతులకు వెన్నుపోటు పొడుస్తున్నారని ఆరోపించారు. "పాలమూరు పులి అంటూ

మిగతా 2

# జాతీయ స్థాయిలో బీఆర్ఎస్ పోరాటం

- ఢిల్లీకి వెళ్లిన మహిళా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ
- జాతీయ మహిళా సంఘం, హెచ్‌ఆర్సీలో ఫిర్యాదు
- ఇప్పటికే ఎస్సీఎస్టీ కమిషన్, రాష్ట్ర హెచ్‌ఆర్సీకి ఫిర్యాదు
- తెలంగాణ లో చీకటి రోజులు..జగద్వీశ్వర్ రెడ్డి
- రాష్ట్రంలో గూండాగిరి సాగుతోంది
- ప్రజాప్రతినిధుల హక్కులకు భంగం

వాస్తవదర్పణం స్టేట్‌బ్యూరో

**హైదరాబాద్, సెప్టెంబర్10 :** తెలంగాణలో చీకటి రోజులు సాగుతున్నాయని బీఆర్ఎస్ ఎమ్మెల్యే జగదీశ్వర్ రెడ్డి ఆరోపించారు. అసెంబ్లీ సమావేశాల్లో ప్రతిపక్ష ఎమ్మెల్యేల హక్కులకు స్థానిక పోలీసులు భంగం కలిగించారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం ఢిల్లీ కి చేరుకున్న ఆయన అసెంబ్లీ సమావేశాల సందర్భంగా అసెంబ్లీ కార్యాలయం వద్ద చోటుచేసుకున్న అంశం పై బీఆర్ఎస్ మహిళ నేతలతో కలిసి న్యాయం పోరాటం చేసేందుకు సిద్ధమైనట్లు స్పష్టం చేశారు. దులో భాగంగా ఢిల్లీలో జాతీయ మహిళా కమిషన్ తో పాటు మానవ హక్కుల సంఘాన్ని కలిసి లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేయనున్నారు. గురువారం బీఅర్ఎస్ ఎమ్మెల్యేలు సునీతా లక్ష్మారెడ్డి, సబితా ఇంద్రారెడ్డి, కోవా లక్ష్మి, జగదీష్ రెడ్డి,

మిగతా 2





# 51% ఫిట్‌మెంట్‌తో పీఆర్‌సీ ఇవ్వాలి

- దసరాకు ముందే ప్రకటించాలి..
- 6 డీఏల్లో 3 వెంటనే విడుదల చేయండి
- ఉద్యోగులు, పెన్షనర్ల పెండింగ్ బిల్లులు రూ.10 వేల కోట్లు
- సీఎం రేవంత్‌రెడ్డిని కోరిన టీజీఈజేఏసీ
- పీఆర్‌సీ, డీఏలపై చర్చించి నిర్ణయం: సీఎం

వాస్తవదర్పణం, స్టేట్ బ్యూరో

**హైదరాబాద్, సెప్టెంబర్ 10:** తెలంగాణ ఉద్యోగులు, గెజిటెడ్ అధికారులు, ఉపాధ్యాయులు, కార్మికులు, పెన్షనర్ల సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ ఎంప్లాయీస్ జాయింట్ యాక్షన్ కమిటీ (టీజీఈజేఏసీ) ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డిని కోరింది. జేఏసీ చైర్మన్ మారం జగదీశ్వర్, సెక్రటరీ జనరల్ ఏలూరి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ప్రతినిధులు గురువారం అసెంబ్లీలో సీఎంను కలిసి ఉద్యోగుల ప్రధాన డిమాండ్లను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. సమస్యల పరిష్కారంపై సీఎం సానుకూలంగా స్పందించారని

మిగతా 2

# ఉద్యోగులకు రూ.కోటి బీమా

- దేశంలోనే తొలిసారిగా తెలంగాణలో అమలు
- ప్రభుత్వంపై, ఉద్యోగులపై రూపాయి భారం లేకుండా అమలు
- 12.91 లక్షల మంది ఉద్యోగులు, పెన్షనర్లకు వర్తింపు
- ఇప్పటికే 98 క్లెయిమ్‌ల పరిష్కారం.. రూ.కోట్లలో చెల్లింపులు
- ఉద్యోగుల కోసం హెల్త్‌కార్డు కూడా తీసుకొచ్చాం
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క



**వాస్తవదర్పణం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, సెప్టెంబర్ 10:** రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ సిబ్బంది, పెన్షనర్లకు అందిస్తున్న రూ.కోటి బీమా పథకం అమలు చేస్తోన్న దేశంలో తొలి రాష్ట్రంగా తెలంగాణ రికార్డు సాధించింది. ఉద్యోగి దురదృష్టవశాత్తూ మరణించినా అతడి కుటుంబం ఆర్థికంగా రోడ్డున పడకుండా భద్రత కల్పించాలనే మానవీయ ఉద్దేశంతో అమలు చేయనున్న ఈ పథకాన్ని దేశంలోనే తొలిసారిగా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క గురువారం శాసనసభలో ప్రకటించారు. ప్రభుత్వంపై, ఉద్యోగులపై ఎలాంటి ఆర్థిక భారం లేకుండా బ్యాంకుల సహకారంతో పథకాన్ని అమలు చేస్తున్నట్లు సభకు వివరించారు. గురువారం శాసనసభ ప్రశ్నోత్తరాల సమయంలో ప్రభుత్వ ఉద్యోగులకు ప్రమాద బీమా, హెల్త్ కార్డుల గురించి సభ్యులు అడిగిన ప్రశ్నలకు భట్టి విక్రమార్క వివరణాత్మకంగా చెప్పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం 16 బ్యాంకులతో ఒప్పందం చేసుకుని రెగ్యులర్ ఉద్యోగులు, పెన్షనర్లు, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ సిబ్బందికి బీమా కవరేజీ కల్పిస్తోందన్నారు. ఈ మేరకు 2024 జూన్ 26న ఆర్థిక శాఖ 77వ జీవో సర్క్యులర్ జారీ చేసిందని చెప్పారు. పథకం అమలు విధానం, అర్హతలు, బీమా కవరేజీ, నిబంధనలు, షరతులను అందులో పేర్కొందని వివరించారు

**12.91 లక్షల మందికి కవరేజీ**

రాష్ట్రంలో మొత్తం 12,91,056 మంది ఈ పథకం పరిధిలో ఉన్నట్లు భట్టి చెప్పారు. వీరిలో 5,18,293 మంది రెగ్యులర్ ఉద్యోగులు ఉన్నారన్నారు. ఇంకా 5,00,158 మంది తాత్కాలిక, ఔట్‌సోర్సింగ్, మల్టీపర్పస్ వర్కర్లు, కాంట్రాక్ట్, డైలీవేజ్, ఎన్ఆర్ఈజీఎస్, ఎంటీఎస్, సెర్ప్ తదితర సిబ్బంది ఉన్నారనీ 2,72,600 మంది పెన్షనర్లు, కుటుంబ పెన్షనర్లు ఉన్నారని అన్నారు.

**సింగరేణితో శ్రీకారం**

ఉద్యోగుల కోసం రూ.కోటి బీమా పథకానికి తొలుత సింగరేణి కాలరీస్‌లో శ్రీకారం చుట్టినట్లు డిప్యూటీ సీఎం తెలిపారు. అనంతరం విద్యుత్ శాఖ పరిధిలోని డిస్కమ్‌లు, ఇతర సంస్థల్లో పనిచేస్తున్న ఉద్యోగులకు పథకాన్ని విస్తరించినట్లు చెప్పారు. చివరగా రాష్ట్రంలోని ప్రభుత్వ ఉద్యోగులందరికీ వర్తించేలా విస్తరించినట్లు పేర్కొన్నారు. సింగరేణి ఉద్యోగులకు 2024 ఫిబ్రవరిలో, ఇంధన శాఖ ఉద్యోగులకు 2025లో, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులందరికీ 2026 జూన్ 25 నుంచి పథకం వర్తించేలా చర్యలు తీసుకున్నట్లు వివరించారు.

**ప్రభుత్వానికి రూపాయి భారం లేదు**

ప్రభుత్వ ఉద్యోగులకు జీతాలు చెల్లిస్తున్న బ్యాంకులతో ప్రభుత్వం చర్చలు జరిపి ఈ పథకాన్ని అమలు చేస్తున్నట్లు భట్టి విక్రమార్క చెప్పారు.

**ఇప్పటికే క్లెయిమ్‌ల పరిష్కారం**

రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు సంబంధించి ఇప్పటివరకు 33 క్లెయిమ్‌లు వచ్చాయన్నారు. అందులో 24 క్లెయిమ్‌లను పరిష్కరించినట్లు ప్రకటించారు. విద్యుత్ శాఖకు చెందిన ఎస్పీడీసీఎల్, ఎన్‌పీడీసీఎల్, టీజీ జెన్‌కో, ట్రాన్స్‌కో పరిధిలో 15 క్లెయిమ్‌లు రాగా, అన్నింటినీ పరిష్కరించినట్లు చెప్పారు. ఈ విభాగంలో రూ.15 కోట్లకు పైగా చెల్లింపులు జరిగినట్లు వెల్లడించారు. ఇదిలా ఉండగా సింగరేణి కాలరీస్‌లో 50 క్లెయిమ్‌లు రాగా అన్నింటిని పరిష్కరించినట్లు తెలిపారు.

**ఉద్యోగులకు రూ.1.20 కోట్లు**

ప్రమాదవశాత్తు మరణించిన ఉద్యోగి కుటుంబానికి రూ.కోటి బీమాతో పాటు ఇతర ప్రయోజనాలు కలిపి రూ.1.20 కోట్ల వరకు ప్రయోజనం అందేలా చర్యలు తీసుకున్నట్లు డిప్యూటీ సీఎం చెప్పారు. విమాన ప్రయాణ సమయంలో ప్రమాదం జరిగితే రూ.2 కోట్ల వరకు బీమా ప్రయోజనం కల్పిస్తున్నట్లు వెల్లడించించారు. సహజ మరణానికి రూ.10 లక్షల వరకు ప్రయోజనం కల్పించే వెసులుబాటు కూడా ఉన్నట్లు చెప్పారు.

**కేంద్రం, ఇతర రాష్ట్రాలు అధ్యయనం**

తెలంగాణలో ప్రారంభించిన ప్రమాద బీమా పథకాన్ని కేంద్ర ప్రభుత్వం అధ్యయనం చేసిందని ఉప ముఖ్యమంత్రి సభకు చెప్పారు. ఇతర రాష్ట్రాలు సైతం తెలంగాణలో అమలు చేస్తున్న ఈ బీమా విధానాన్ని పరిశీలించేందుకు ఆసక్తి చూపుతున్నాయని చెప్పారు. తమిళనాడు కూడా ఈ తరహా పథకాన్ని అమలు చేసినట్లు ఆయన వెల్లడించారు.

**ఉద్యోగులకు హెల్త్‌కార్డు**

బీమా పథకంతో పాటు ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్ల కోసం హెల్త్‌కార్డు పథకాన్ని కూడా తీసుకొచ్చినట్లు డిప్యూటీ సీఎం చెప్పారు. దశాబ్దాలుగా ఉద్యోగ సంఘాలు కోరుతున్న క్యాష్‌లెస్ వైద్య సేవల కలను ప్రభుత్వం సాకారం చేసిందని ఆయన చెప్పారు. ఉద్యోగులు, వారి సంఘాల ప్రతినిధులు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, సంబంధిత ముఖ్య కార్యదర్శులతో కమిటీ ఏర్పాటు చేసి చర్చల అనంతరం హెల్త్‌కార్డుల విధానాన్ని ఖరారు చేసినట్లు వివరించారు. క్యాష్‌లెస్ వైద్యం, సీజీహెచ్ఎస్ ప్యాకేజీ వంటి సదుపాయాలు అందుబాటులోకి తీసుకొచ్చినట్లు ఆయన చెప్పారు. హెల్త్‌కార్డు పథకం కోసం ఇప్పటికే సుమారు రూ.240 కోట్ల నిధులు కేటాయించినట్లు ఉప ముఖ్యమంత్రి చెప్పారు. ఉద్యోగుల సంక్షేమానికి బీమా, ఆరోగ్య భద్రతకు హెల్త్‌కార్డు, రెండు పథకాలూ ఉద్యోగ కుటుంబాలకు ఆర్థిక, వైద్య భరోసా కల్పించేలా రూపొందించామని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క శాసనసభకు చెప్పారు.

# బీఆర్ఎస్‌పైనే వ్యతిరేకత!

మొదటిపేజీ తరువాయి

వివరించినట్లు తెలుస్తోంది. ప్రధాన ప్రతిపక్షమైన బీఆర్ఎస్ అసెంబ్లీ కార్యకలాపాలను సజావుగా సాగనివ్వకుండా కుట్ర చేసిందని సీఎం రేవంత్‌రెడ్డి ఆరోపించారు. మాజీ సీఎం కేసీఆర్ అధ్యక్షతన ఫామ్‌హౌస్‌లో సమావేశమై సభను అడ్డుకునే వ్యూహాన్ని రూపొందించారని ఆయన విమర్శించినట్లు తెలుస్తోంది. అధికారం కోల్పోయినప్పటికీ బీఆర్ఎస్ నేతలు తమ అహంకార వైఖరిని మార్చుకోలేదని సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించినట్లు సమాచారం. కాంగ్రెస్ ఎమ్మెల్యేల పనితీరుపైనా సీఎం రేవంత్‌రెడ్డి సమావేశంలో దిశానిర్దేశం చేశారు ప్రజలు అప్పగించిన పదవిని బాధ్యతగా నిర్వహించాలని, అసెంబ్లీ జరిగే అన్ని రోజుల్లో సభ్యులు పూర్తి స్థాయిలో హాజరై చర్చల్లో పాల్గొనాలని సూచించారు. తమ తమ నియోజకవర్గాలకు సంబంధించిన సమస్యలను సభలో ప్రస్తావించాలని ఎమ్మెల్యేలకు నిర్దేశం చేశారు. ఎమ్మెల్యేల వ్యక్తిగత పనితీరు, ప్రవర్తన భవిష్యత్ రాజకీయ విజయాలపై ప్రభావం చూపుతుందని సీఎం రేవంత్ రెడ్డి హెచ్చరించినట్లు సమాచారం. మొదటిసారి ఎన్నికైన ఎమ్మెల్యేల ప్రవర్తన రెండోసారి గెలుపుపై ప్రభావం చూపుతుందని.. వ్యక్తిగత పనితీరే గెలుపు, ఓటములను నిర్ణయిస్తుందని సీఎం రేవంత్ రెడ్డి శాసన సభ్యులకు సూచించారు. కాంగ్రెస్ నుంచి రాజకీయంగా ఎదిగి ప్రస్తుతం ఆ పార్టీపై విమర్శలు చేస్తున్న కొందరు నేతల వ్యవహారశైలిని కూడా సీఎం రేవంత్ రెడ్డి ప్రస్తావించారు. కాంగ్రెస్ అవకాశం ఇవ్వకపోతే సునీతా లక్ష్మారెడ్డి, సబితా ఇంద్రారెడ్డి వంటి నేతలు రాష్ట్రస్థాయి నాయకులుగా ఎదిగేవారా అని ఆయన ప్రశ్నించినట్లు సమాచారం. మరోవైపు కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలన పూర్తి చేసుకున్న నేపథ్యంలో అమలు చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించేందుకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని సీఎం రేవంత్‌రెడ్డి ఎమ్మెల్యేలకు సూచించినట్లు సమాచారం. ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలు, తీసుకున్న నిర్ణయాలపై ప్రజలకు విస్తృతంగా వివరించాలని, వాటి ఫలితాలను క్షేత్రస్థాయిలోకి తీసుకెళ్లాలని సూచించినట్లు తెలుస్తోంది. వెయ్యి రోజుల పాలనలో ఎమ్మెల్యేలు అందించిన సహకారానికి సీఎం కృతజ్ఞతలు తెలిపినట్లు సమాచారం.

# రాష్ట్రంలో అనుముల బ్రదర్స్ రాజ్యం

మొదటిపేజీ తరువాయి

కేటీఆర్ ధ్వజమెత్తారు. సీఎం రేవంత్ రెడ్డి సోదరుడు అనుముల కొండల్ రెడ్డి ఇజ్రాయెల్ ఇన్నోవేషన్ సంస్థతో భాగస్వామ్యం కుదుర్చుకుని ఏరోస్పేస్, డిఫెన్స్ వెంచర్ పేరిట ఖరీదైన భూములు కొల్లగొట్టారని ఆరోపించారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలుకు నోచుకోలేదని, సోదరు జేబులు మాత్రం నింపుతున్నారని ధ్వజమెత్తారు. మరోవైపు ఇందిరమ్మ రాజ్యం పాలసీలో రోజుల్లో నెలకు రూ.4,000 పింఛన్, మహిళలకు రూ.2,500, నిరుద్యోగులకు రూ.4,000 భృతి ఇస్తామని చెప్పి ప్రజలకు మొండిచేయి చూపారని స్పష్టం చేశారు. సీఎం నిరుద్యోగ సోదరులకు ఉపాధితో పాటు వందల కోట్ల భూములు దక్కుతున్నాయని ఎద్దేవా చేశారు. కేంద్రంలోని బీజేపీకి నిజాయితీ ఉంటే ఈ మొత్తం షెల్ కంపెనీ భూ కుంభ కోణం పై తక్షణమే ఈడీ, సీబీఐ, ఐటీ శాఖలతో సమగ్ర విచారణ జరిపించి వాస్తవాలను ప్రజలముందు పెట్టాలని ఆయన డిమాండ్ చేశారు.

# ‘బ్రిక్స్’కు భారత్ సిద్ధం




- భారత్ వైపు ప్రపంచం చూపు
- 12, 13 తేదీల్లో శిఖరాగ్ర సదస్సు
- పుతిన్, జిన్‌పింగ్‌తో ప్రధాని భేటీలకు అవకాశం
- అగ్రనేతల రాకతో ఢిల్లీలో కట్టుదిట్టమైన భద్రత

**వాస్తవదర్పణం, నేషనల్ డెస్క్:**

ప్రపంచ రాజకీయ, ఆర్థిక పరిణామాల నేపథ్యంలో అత్యంత కీలకమైన బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సుకు భారత్ సిద్ధమైంది. సెప్టెంబర్ 12, 13 తేదీల్లో ఢిల్లీలో జరిగే బ్రిక్స్2026 సదస్సుకు ప్రధాని నరేంద్ర మోడీ అధ్యక్షత వహించనున్నారు. సభ్య దేశాలు, భాగస్వామ్య దేశాల అధినేతలతో పాటు ఆహ్వానిత దేశాల ప్రతినిధులు, అంతర్జాతీయ సంస్థల అధిపతులు సదస్సుకు హాజరుకానున్నారు. రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్, చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌తో మోడీ ద్వైపాక్షిక భేటీలు నిర్వహించే అవకాశం ఉండటంతో ఈ సమావేశంపై అంతర్జాతీయంగా ఆసక్తి నెలకొంది. ‘బిల్డింగ్ ఫర్ రెసిలియన్స్, ఇన్నోవేషన్, కోఆపరేషన్ అండ్ సస్టెయినబిలిటీ’ థీమ్‌తో సదస్సు జరగనుంది. ప్రపంచ వాణిజ్యంలో పెరుగుతున్న భౌగోళిక, రాజకీయ సవాళ్ల నేపథ్యంలో సరఫరా గొలుసులను బలోపేతం చేయడం, సభ్య దేశాల మధ్య వాణిజ్యాన్ని పెంచడం భారత్ ప్రధాన లక్ష్యాలుగా ఉన్నాయి. కృత్రిమ మేధ (ఏఐ), ఫిన్‌టెక్, డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, డేటా ఆధారిత వ్యవస్థల్లో సహకారంపైనా చర్చలు జరగనున్నాయి.

**గ్లోబల్ సౌత్.. భారత్ గొంతుక**

బ్రిక్స్‌ను గ్లోబల్ సౌత్ దేశాల ప్రయోజనాలకు మరింత బలమైన వేదికగా మార్చాలని భారత్ భావిస్తోంది. ఇంధన పరివర్తన, వాతావరణ స్థితిస్థాపకత, కీలక ఖనిజాలు, గ్రీన్ ఫైనాన్స్, ఇంధన భద్రత వంటి అంశాలకు ప్రాధాన్యం ఇవ్వనుంది. స్మార్ట్ గ్రిడ్లు, హైడ్రోజన్, బయోఫ్యూయల్స్, కార్బన్ క్యాప్చర్ రంగాల్లో పరస్పర సహకారాన్ని పెంచే అంశాలను ముందుకు తీసుకురానుంది. అంతర్జాతీయ ద్రవ్య, ఆర్థిక సంస్థల్లో సంస్కరణలు, అభివృద్ధి చెందుతున్న దేశాలకు అధిక ప్రాధాన్యం కల్పించడంపైనా భారత్ తన వాదన వినిపించనుంది.

**పుతిన్‌తో ముందు.. జిన్‌పింగ్‌తో తర్వాత**

బ్రిక్స్ సదస్సుకు రష్యా అధ్యక్షుడు పుతిన్ హాజరుకానున్నారు. సెప్టెంబర్ 11న మోడీతో ఆయన ద్వైపాక్షిక చర్చలు జరపనున్నట్లు సమాచారం. ఆగస్టు 31న బిష్కెక్‌లో జరిగిన ఎస్‌సీఓ సదస్సు సందర్భంగా మోడీ స్వయంగా పుతిన్‌ను భారత్‌కు ఆహ్వానించారు. చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ కూడా సదస్సుకు హాజరుకానున్నట్లు తెలుస్తోంది. ఆయనతోనూ మోడీ ద్వైపాక్షిక భేటీ నిర్వహించే అవకాశం ఉంది. జిన్‌పింగ్ చివరిసారిగా 2019లో భారత్‌లో పర్యటించారు.

**ఢిల్లీకి కొత్త కళ.. కట్టుదిట్టమైన భద్రత**

బ్రిక్స్ సదస్సు నేపథ్యంలో ఢిల్లీ నగరం కొత్త అలంకరణలతో ముస్తాబవుతోంది. భారత్ మండపం పరిసరాల్లో విస్తృత భద్రత, ట్రాఫిక్ ఏర్పాట్లు చేస్తున్నారు. కన్నాట్ ప్లేస్, ఖాన్ మార్కెట్ వంటి ప్రముఖ ప్రాంతాల్లో బ్రిక్స్ పోస్టర్లు, బ్యానర్లు, ప్రత్యేక లైటింగ్ ఏర్పాటు చేశారు. భద్రతలో భాగంగా సుమారు 500 సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేశారు. ఢిల్లీ పోలీస్ కమిషనర్ అధ్యక్షతన ఉన్నతాధికారులు భద్రతా ఏర్పాట్లను సమీక్షించారు.

**సదస్సుకు హాజరయ్యే ప్రముఖులు**

దక్షిణాఫ్రికా అధ్యక్షుడు సిరిల్ రమఫోసా, ఈజిప్ట్ అధ్యక్షుడు అబ్దుల్ ఫత్తా ఎల్‌సీసీ, ఇండోనేసియా అధ్యక్షుడు ప్రబోవో సుబియాంటో, ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియన్, ఇథియోపియా ప్రధాని అబియ్ అహ్మద్, బెలారస్ అధ్యక్షుడు అలెగ్జాండర్ లుకషెంకో, కజకిస్థాన్ అధ్యక్షుడు కాస్సిమ్ జోమార్ట్ టోకాయెవ్, మలేసియా ప్రధాని అన్వర్ ఇబ్రహీం, థాయ్‌లాండ్ ప్రధాని అనుటిన్ చార్న్‌విరాకుల్ తదితరులు హాజరుకానున్నారు. ఐరాస ప్రధాన కార్యదర్శి ఆంటోనియో గుటెర్రెస్ కూడా పాల్గొనే అవకాశం ఉంది.

# పంచాయతీల నిధులు సొంత ఖాతాల్లోనే!

మొదటిపేజీ తరువాయి

తెలిపారు. గ్రామ పంచాయతీలకు వచ్చే సొంత ఆదాయం గ్రామ అభివృద్ధికే వినియోగించాలని ప్రభుత్వం భావిస్తోందన్నారు. నిధుల వినియోగంలో పారదర్శకత, ప్రజలకు జవాబుదారీతనం ఉండేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. ప్రస్తుతం పంచాయతీలు సొంత ఆదాయాన్ని ట్రెజరీ ఖాతాలో జమ చేసి, అవసరమైనప్పుడు తిరిగి డ్రా చేసుకోవాల్సి వస్తోందని వివరించారు. ఇందుకు పలు పత్రాలు, అనుమతులు, ఇతర ప్రక్రియలు పూర్తి చేయాల్సి ఉండటంతో నిధుల వినియోగంలో ఆలస్యం జరుగుతోందన్నారు.

**డ్రైనేజీ నుంచి వీధి దీపాల వరకు**

గ్రామంలో డ్రైనేజీ సమస్య, తాగునీటి పైప్‌లైన్ మరమ్మతు, వీధి దీపాల ఏర్పాటు, పారిశుధ్య పనులు వంటి చిన్నచిన్న అత్యవసర అవసరాలకు నిధులు తక్షణమే అందుబాటులో ఉండాల్సిన అవసరం ఉందని సీతక్క చెప్పారు. అందుకే పంచాయతీకి వచ్చిన సొంత ఆదాయం గ్రామ అవసరాలకు సకాలంలో వినియోగించేలా చట్ట సవరణ చేస్తున్నామని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ఆర్థిక సంఘాల నిధులు బ్యాంకు ఖాతాల్లో జమ అవుతున్నట్లే.. పంచాయతీల సొంత ఆదాయాన్ని కూడా బ్యాంకు ఖాతాల్లో జమ చేసుకునే అవకాశం కల్పిస్తున్నామని చెప్పారు. గ్రామసభ తీర్మానం మేరకు ఆ నిధులను అవసరాలకు ఖర్చు చేసుకోవచ్చని తెలిపారు.

**పంచాయతీలపై గతంలో వివక్ష**

మున్సిపాలిటీలకు సొంత ఆదాయాన్ని బ్యాంకు ఖాతాల్లో జమ చేసుకునే అవకాశం ఉన్నప్పటికీ.. గ్రామ పంచాయతీలకు ఆ వెసులుబాటు లేదని సీతక్క అన్నారు. గత ప్రభుత్వం పంచాయతీలపై వివక్ష చూపిందని ఆరోపించారు. ఆ పరిస్థితిని మార్చేందుకే చట్ట సవరణ తీసుకొస్తున్నామని చెప్పారు.

**పెండింగ్‌లో రూ.619 కోట్ల నిధులు**

బీసీ రిజర్వేషన్ల కారణంగా పంచాయతీ ఎన్నికలు ఆలస్యం కావడంతో ఆ కాలానికి సంబంధించిన కేంద్ర నిధులు పూర్తిస్థాయిలో రాలేదని మంత్రి తెలిపారు. ప్రతి నెల పంచాయతీల కోసం రూ.50 కోట్లు ప్రభుత్వం ఖర్చు చేస్తోందన్నారు. 2025-26కు సంబంధించి రెండో విడతగా కేంద్రం నుంచి రూ.619 కోట్లు రావాల్సి ఉందని వెల్లడించారు. మల్టీ పర్పస్ వర్కర్లకు ప్రతి నెల మొదటి తేదీనే వేతనాలు చెల్లిస్తున్నామని చెప్పారు.

**ప్రతి ఇంటికీ ఇంకుడు గుంత**

గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దఎత్తున చర్యలు చేపడుతోందని సీతక్క తెలిపారు. ప్రతి ఇంటికి ఇంకుడు గుంత, పొలానికి పంట కుంట, ఊరికి ఊట కుంట నిర్మాణం చేపడుతున్నామని చెప్పారు. ప్రతి గ్రామానికి పక్కా రహదారి ఉండాలన్న లక్ష్యంతో సీఎం రేవంత్‌రెడ్డి నిధులు మంజూరు చేస్తున్నారని, గ్రామాల నుంచి మండల కేంద్రాలకు డబుల్ రోడ్ల నిర్మాణం చేపడుతున్నామని తెలిపారు. హైబ్రిడ్ యాన్యుటీ మోడల్ విధానంలో వేల కిలోమీటర్ల మేర రహదారులు నిర్మిస్తున్నామని చెప్పారు. అటవీ ప్రాంతాల్లో కేంద్ర అటవీ చట్టాల కారణంగా రోడ్ల నిర్మాణానికి ఇబ్బందులు ఎదురవుతున్నాయని, వాటికి కేంద్రం నుంచి క్లియరెన్స్ ఇప్పించాల్సిన అవసరం ఉందన్నారు. ఉప సర్పంచ్‌ల చెక్ పవర్‌పై కూడా త్వరలో నిర్ణయం తీసుకుంటామని మంత్రి సీతక్క వెల్లడించారు.

**మున్సిపల్ చట్ట సవరణ బిల్లుకు శ్రీకారం**

ఇదే సమయంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తరఫున మంత్రి శ్రీధర్‌బాబు మున్సిపల్ చట్ట సవరణ బిల్లును సభలో ప్రవేశపెట్టారు. గ్రామీణ, పట్టణ స్థానిక సంస్థలను మరింత బలోపేతం చేసే దిశగా చట్టపరమైన మార్పులు తీసుకొస్తున్నట్లు ప్రభుత్వం తెలిపింది.

# 51% ఫిట్‌మెంట్‌తో పీఆర్సీ ఇవ్వాలి

మొదటిపేజీ తరువాయి

జేఏసీ నేతలు తెలిపారు. అంతకుముందు స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌ను కలిసి ఉద్యోగుల సమస్యలపై వినతిపత్రం సమర్పించారు. ఈ అంశాలను సీఎం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి చొరవ చూపుతానని స్పీకర్ హామీ ఇచ్చినట్లు జేఏసీ నేతలు తెలిపారు.

**దసరాకు ముందే 51% ఫిట్‌మెంట్**

శివశంకర్ నేతృత్వంలోని పీఆర్సీ కమిటీ నుంచి నివేదికను వెంటనే తెప్పించి, 51 శాతం ఫిట్‌మెంట్‌తో రెండో పీఆర్సీని దసరా పండుగకు ముందే ప్రకటించాలని జేఏసీ డిమాండ్ చేసింది. ప్రస్తుతం పెండింగ్‌లో ఉన్న ఆరు డీఏల్లో కనీసం మూడు డీఏలను తక్షణమే విడుదల చేయాలని కోరింది.

**పెండింగ్ బిల్లులు రూ.10 వేల కోట్లు**

ఉద్యోగులు, పెన్షనర్లకు సంబంధించిన రూ.10 వేల కోట్లకు పైగా పెండింగ్ బిల్లులను త్వరితగతిన విడుదల చేయాలని జేఏసీ విజ్ఞప్తి చేసింది. ప్రస్తుతం నెలకు సుమారు రూ.1,000 కోట్లు విడుదల చేస్తున్నందున.. ఈ మొత్తాన్ని రూ.2,000 కోట్లకు పెంచాలని కోరింది. ఇందులో రూ.1,000 కోట్లు ఉద్యోగులకు, మరో రూ.1,000 కోట్లు పెన్షనర్లకు కేటాయించాలని సూచించింది.

**సీపీఎస్ రద్దు.. ఓపీఎస్ పునరుద్ధరణ**

కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ (సీపీఎస్)ను రద్దు చేసి, పాత పెన్షన్ విధానం (ఓపీఎస్)ను పునరుద్ధరించేందుకు వెంటనే కమిటీ ఏర్పాటు చేసి సమస్యను పరిష్కరించాలని జేఏసీ కోరింది. ఉద్యోగులు, పెన్షనర్లకు ప్రయోజనం కలిగేలా నూతన ఉద్యోగుల ఆరోగ్య పథకం (ఎన్ఈహెచ్ఎస్)ను సమర్థవంతంగా అమలు చేయాలని విజ్ఞప్తి చేసింది. ఉద్యోగ సంఘాల గుర్తింపు ప్రక్రియను కూడా వెంటనే పూర్తి చేయాలని కోరింది.

**పీఆర్సీ నివేదిక వచ్చాక నిర్ణయం: సీఎం**

పీఆర్సీ నివేదిక సమర్పించేందుకు ఇప్పటికే కమిషన్‌కు ప్రభుత్వం లేఖ పంపిందని సీఎం రేవంత్‌రెడ్డి జేఏసీ నేతలకు తెలిపినట్లు వారు వెల్లడించారు. నివేదిక అందిన తర్వాత పరిశీలించి, ఉద్యోగ సంఘాల ప్రతినిధులతో చర్చించి పీఆర్సీ, డీఏలపై తుది నిర్ణయం తీసుకుంటామని సీఎం హామీ ఇచ్చినట్లు తెలిపారు. గత జనవరి నుంచి ఇప్పటివరకు ప్రభుత్వం సుమారు రూ.10 వేల కోట్లను విడుదల చేసిందని సీఎం చెప్పినట్లు జేఏసీ నేతలు తెలిపారు. అసెంబ్లీ సమావేశాలు పూర్తయిన అనంతరం ఆర్థిక శాఖతో సమావేశమై రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని సమీక్షించి, ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని సీఎం హామీ ఇచ్చినట్లు వెల్లడించారు. ఉద్యోగ సంఘాల ప్రతినిధులతో మరోసారి సమావేశమై అన్ని అంశాలపై చర్చించి పరిష్కార మార్గాలను ఖరారు చేస్తామని సీఎం చెప్పారని తెలిపారు. ఈ సమావేశంలో దామోదర్‌రెడ్డి, చావ రవి, సదానంద గౌడ్, గౌతమ్‌కుమార్, కటకం రమేష్, ముజీబ్ హుస్సేన్, బి.శ్యామ్, వెంకట్, రమణరెడ్డి, భిక్షం గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# నీళ్లు ఉండి ఎత్తలేని దద్దమ్మ ప్రభుత్వం!

మొదటిపేజీ తరువాయి

విర్రవీగుతున్నారు.. నీటి వినియోగంలో మాత్రం పిల్లిలా వ్యవహరిస్తున్నారు” అని ఎద్దేవా చేశారు.

**4 వేల క్యూసెక్కులకు.. 700 క్యూసెక్కులే**

కల్వకుర్తి ఎత్తిపోతల పథకంలోని ఎల్లూరు పంప్‌హౌస్‌లో ఐదు మోటార్లు 24 గంటలు నడపాల్సి ఉండగా కేవలం రెండు మాత్రమే పనిచేస్తున్నాయని హరీశ్‌రావు తెలిపారు. అవి కూడా ఆన్-ఆఫ్ విధానంలో నడుస్తుండటంతో రోజుకు సగటున 11 గంటలే పనిచేస్తున్నాయని అన్నారు. 4 వేల క్యూసెక్కుల సామర్థ్యం ఉన్న చోట కేవలం 700 క్యూసెక్కుల నీటినే ఎత్తుతున్నారని ఆరోపించారు. బీమాలో మూడు మోటార్లకు ఒకటి, నెట్టంపాడులో నాలుగింటికి ఒకటి, కోయిల్‌సాగర్‌లో మూడింటికి ఒక మోటార్ మాత్రమే నడుపుతున్నారని చెప్పారు. కృష్ణా బేసిన్‌లోని తెలంగాణ ప్రాజెక్టుల మోటార్లు ఆపేసి, బేసిన్‌లో లేని వెలిగొండ ద్వారా ఏపీ నీటిని తరలించుకుపోతుంటే ప్రభుత్వం ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నించారు.

**ఏపీకి 35 టీఎంసీలు.. తెలంగాణకు 7 టీఎంసీలే!**

శ్రీశైలం నుంచి అధికారిక లెక్కల ప్రకారం ఏపీ 35 టీఎంసీల నీటిని తీసుకుపోగా, తెలంగాణ కేవలం 7 టీఎంసీలే ఎత్తుకుందని హరీశ్‌రావు ఆరోపించారు. “తెలంగాణ రైతాంగానికి నీళ్లు నిల్లు.. ఏపీ రైతాంగానికి నీళ్లు ఫుల్లు” అన్న పరిస్థితి నెలకొందన్నారు. 2024-25లో కృష్ణా జలాల వినియోగం 28.49 శాతం, 2025-26లో 25.77 శాతం మాత్రమే ఉందని పేర్కొన్నారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత ఈ మూడేళ్లలో కృష్ణా జలాల వినియోగం అత్యల్పంగా ఉందన్నారు. తాత్కాలికంగా అందుబాటులో ఉన్న నీటిని కూడా వినియోగించుకోలేని పరిస్థితి ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమని విమర్శించారు.

**పాలమూరు పనులు నెల రోజుల్లో పూర్తి చేయొచ్చు**

పాలమూరు ప్యాకేజీ-3 పనులను నెల రోజుల పాటు శ్రమిస్తే పూర్తి చేయవచ్చని హరీశ్‌రావు అన్నారు. మూడేళ్లుగా ప్రభుత్వం వాటిని ఎందుకు పూర్తి చేయడం లేదని ప్రశ్నించారు. పనులు పూర్తయితే 5 నుంచి 6 లక్షల ఎకరాలకు సాగునీరు అందుతుందని తెలిపారు. కేసీఆర్ హయాంలో కల్వకుర్తి, బీమా, నెట్టంపాడు, కోయిల్‌సాగర్ ప్రాజెక్టులకు రూ.4 వేల కోట్లు ఖర్చు చేసి పూర్తి చేసి 6.5 లక్షల ఎకరాలకు నీరందించామని చెప్పారు. కల్వకుర్తి ద్వారా గతంలో 13 వేల ఎకరాలకు మాత్రమే నీరు అందగా, బీఆర్ఎస్ హయాంలో 3.07 లక్షల ఎకరాలకు సాగునీరు అందించామని పేర్కొన్నారు.

**రైతుకు పవర్‌పాయింట్ కాదు.. పవర్ కావాలి**

“రైతుకు బూతులు, పవర్‌పాయింట్ ప్రజెంటేషన్లు అవసరం లేదు.. పంపులకు పవర్, పొలాలకు సాగునీరు కావాలి” అని హరీశ్‌రావు అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా రైతులు విద్యుత్, సాగునీటి కోసం సబ్‌స్టేషన్ల ఎదుట ఆందోళనలు చేస్తున్నారని తెలిపారు. సీఎం నియోజకవర్గంలోనే రైతులు అర్ధనగ్న ప్రదర్శనలు చేస్తున్నారని, పొంగులేటి నియోజకవర్గంలోనూ రైతులు నిరసనలు చేపడుతున్నారని చెప్పారు.

**నిజామాబాద్‌లోనూ లిఫ్టులు ఆన్ చేయాలి**

మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి మాట్లాడుతూ నిజామాబాద్ జిల్లాలో రైతుల పరిస్థితి దారుణంగా ఉందన్నారు. ఎస్సారెస్పీలో 46 టీఎంసీల నీరు ఉన్నప్పటికీ గుత్ప, అలీసాగర్ లిఫ్టులను పూర్తిస్థాయిలో నడపడం లేదని ఆరోపించారు. గుత్పలో నాలుగు మోటార్లకు ఒక్కటే నడుపుతున్నారని, అలీసాగర్‌లోనూ పూర్తి సామర్థ్యంతో నీటిని ఎత్తడం లేదన్నారు. గుత్ప, అలీసాగర్ లిఫ్టులను పూర్తిస్థాయిలో నడిపి చెరువులు నింపాలని, బాల్కొండలోని లక్ష్మీకెనాల్‌కు నిండుగా నీరు ఇవ్వాలని డిమాండ్ చేశారు. చౌటుపల్లి హన్మంతరెడ్డి లిఫ్ట్‌తో పాటు అన్ని లిఫ్టులను వెంటనే ఆన్ చేయాలని కోరారు.

**బీఆర్ఎస్ నిలదీస్తేనే ప్రభుత్వం మేల్కొంటుందా?**

సాగర్‌కు నీటిని విడుదల చేయాలని బీఆర్ఎస్ డిమాండ్ చేసిన తర్వాతే ప్రభుత్వం కొద్దికొద్దిగా నీటిని విడుదల చేస్తోందని హరీశ్‌రావు అన్నారు. “ప్రకృతి వైపరీత్యం కావచ్చు.. కానీ నీరు అందుబాటులో ఉండి కూడా రైతుకు అందించకపోవడం ప్రభుత్వ వైఫల్యం.. కాంగ్రెస్ వైపరీత్యం” అని వ్యాఖ్యానించారు. ఏపీ నీటి తరలింపునకు వెంటనే అడ్డుకట్ట వేయాలని, అవసరమైతే అపెక్స్ కౌన్సిల్ సమావేశాన్ని కోరాలని డిమాండ్ చేశారు. పాలమూరు ప్రాజెక్టుల మోటార్లన్నింటినీ పూర్తి సామర్థ్యంతో నడిపి రైతుల పొలాలకు నీరు అందించాలని, సాగర్ కాల్వకు నీటిని విడుదల చేసి నల్లగొండ ప్రాంత పంటలను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు.

# జాతీయ స్థాయిలో బీఆర్ఎస్ పోరాటం

మొదటిపేజీ తరువాయి

పల్లా రాజేశ్వర్ రెడ్డి, ఎమ్మెల్సీ వాణిదేవి ఢిల్లీకి బయలుదేరి వెళ్లారు. అసెంబ్లీ సమావేశాల్లో భాగంగా మహిళా ఎమ్మెల్యే పై జరిగిన దాడి, పోలీసులు, కాంగ్రెస్ నేతలు ప్రవర్తించిన తీరును వివరించనున్నారు. అంతే కాకుండా ఆయా అంశాలకు సంబధించిన పూర్తి ఆధారాలు సమర్పించి చర్యలు తీసుకోవాలని కోరనున్నారు. ఇది ఇలా ఉండగా రాష్ట్రంలో ఎస్సీఎస్టీ కమిషన్, రాష్ట్ర మానవ హక్కులు సంఘానికి బీఆర్ఎస్ నేతలు ఇప్పటికే ఫిర్యాదు చేశారు. కాగా ఈ అంశాన్ని జాతీయ స్థాయిలో చర్చ జరిగిలే కసరత్తు చేస్తున్నారు. మహిళలు అని చూడకుడా పోలీసులు రాష్ట్ర ప్రభుత్వం వ్యవహరించిన తీరు పై విచారణ చేపట్టాలని, తమకు న్యాయం చేయాలని కోరనున్నారు. మరోవైపు క్షుద్ర పూజల పేరుతో హరీష్ రావు పైఆరోపణలు చేసిన కాంగ్రెస్ నేతలు పై చర్యలు తీసుకోవాలని జాతీయ మానవ హక్కులు సంఘం రాష్ట్ర పోలీసు ఉన్నతాధికారికి ఆదేశాలు జారి చేసింది. తాజాగా మహిళా ప్రజాప్రతినిధులు సైతం న్యాయం చేయాలని కోరుతూ జాతీయ స్థాయిలో పోరాటం చేసేందుకు సిద్ధం కావడంతో మ కాంగ్రెస్ నేతల పై ఎటువంటి చర్యలు తీసుకుంటారన్నది చర్చాంశంగా మారింది.

# విద్యుత్ డిమాండ్ 19 వేల మెగావాట్లు

- ఫ్లోటింగ్ సోలార్‌కు జలాశయాలు
- సాగర్, శ్రీశైలం సహా 13 రిజర్వాయర్లలో అధ్యయనం
- ఏటా విద్యుత్ సబ్సిడీ భారం రూ.19 వేల కోట్లు
- 80 గిరిజన గ్రామాల్లో మైక్రో గ్రిడ్
- 6.70 లక్షల ఎకరాలపై సోలార్ అవకాశాల పరిశీలన
- శాసన సభలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క



**వాస్తవదర్పణం, స్టేట్ బ్యూరో, హైదరాబాద్, సెప్టెంబర్ 10:** రాష్ట్రంలో విద్యుత్ డిమాండ్ భారీగా పెరుగుతోంది. 2023 డిసెంబర్‌లో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన సమయంలో గరిష్ఠ డిమాండ్ సుమారు 15 వేల మెగావాట్లుగా ఉండగా.. సెప్టెంబర్ 9 నాటికి 18,543 మెగావాట్లకు చేరిందని ఉప ముఖ్యమంత్రి, విద్యుత్ శాఖ మంత్రి భట్టి విక్రమార్క శాసనసభలో వెల్లడించారు. పారిశ్రామిక వృద్ధి, ప్రజల కొనుగోలు శక్తి పెరగడం వంటి కారణాలతో డిమాండ్ పెరుగుతోందని తెలిపారు. భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా విద్యుత్ ఉత్పత్తి, పంపిణీ వ్యవస్థలను సిద్ధం చేస్తున్నామని చెప్పారు.

**13 జలాశయాల్లో ఫ్లోటింగ్ సోలార్**

పెరుగుతున్న విద్యుత్ అవసరాలను తీర్చేందుకు సంప్రదాయేతర ఇంధన వనరులను పెద్ద ఎత్తున ప్రోత్సహించాలని ప్రభుత్వం నిర్ణయించిందని భట్టి తెలిపారు. ప్రధాన, మధ్య తరహా సాగునీటి ప్రాజెక్టుల రిజర్వాయర్లలో ఫ్లోటింగ్ సోలార్ ప్లాంట్ల ఏర్పాటుపై విద్యుత్, నీటిపారుదల శాఖలు సంయుక్తంగా అధ్యయనం చేస్తున్నాయని చెప్పారు. నాగార్జునసాగర్, శ్రీశైలం, పులిచింతల, శ్రీరాంసాగర్, శ్రీపాద ఎల్లంపల్లి, దేవాదుల, కొమురంభీం, పాలేరు, వైరా, మల్లన్నసాగర్, ఎల్ఎండీ, మిడ్‌మానేరు, పోచారం జలాశయాలను పరిశీలిస్తున్నట్లు వెల్లడించారు. అధ్యయనం పూర్తయిన తర్వాత త్వరలో స్పష్టమైన నిర్ణయం ప్రకటిస్తామని తెలిపారు.

**మెగావాట్‌కు రూ.1.30 కోట్ల అదనపు భారం**

సాధారణ సోలార్ ప్లాంట్లతో పోలిస్తే ఫ్లోటింగ్ సోలార్ ప్రాజెక్టుల ఏర్పాటుకు అధిక వ్యయం అవుతోందని భట్టి చెప్పారు. కేంద్రం వయబిలిటీ గ్యాప్ ఫండింగ్ కింద మెగావాట్‌కు రూ.కోటి వరకు సహాయం అందించే పథకం ప్రకటించినప్పటికీ.. దేశీయంగా తయారైన పరికరాలనే వినియోగించాలన్న నిబంధనలతో మెగావాట్‌కు మరో రూ.1.30 కోట్ల వరకు అదనపు భారం పడుతోందని వివరించారు. ఈ నిబంధనలను సడలిస్తే పెట్టుబడిదారుల్లో ఆసక్తి మరింత పెరుగుతుందని అభిప్రాయపడ్డారు.

**ఏటా రూ.19 వేల కోట్ల సబ్సిడీ**

వ్యవసాయ పంపుసెట్లకు ఉచిత విద్యుత్ కోసం ప్రభుత్వం ఏటా సుమారు రూ.14 వేల కోట్లు, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ పథకం కోసం మరో రూ.5 వేల కోట్లు ఖర్చు చేస్తోందని భట్టి తెలిపారు. మొత్తంగా విద్యుత్ సబ్సిడీలపై ఏడాదికి దాదాపు రూ.19 వేల కోట్లు వెచ్చిస్తున్నామని చెప్పారు. భవిష్యత్‌లో ఈ భారాన్ని తగ్గించుకుంటూనే ప్రజలకు ఉచిత విద్యుత్ అందించే మార్గాలపై దృష్టి సారిస్తున్నామని తెలిపారు.

**80 గ్రామాల్లో మైక్రో గ్రిడ్**

అమ్రాబాద్ గిరిజన ప్రాంతంలో సుమారు 80 గ్రామాలను పూర్తిగా సోలరైజ్ చేసి మైక్రో గ్రిడ్ ఏర్పాటు చేసే పైలట్ ప్రాజెక్టును చేపట్టేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని భట్టి వెల్లడించారు. ఇళ్లపై సోలార్ ప్యానెళ్లను ఏర్పాటు చేసి, మైక్రో గ్రిడ్ ద్వారా విద్యుత్ సరఫరా చేసే విధానాన్ని అమలు చేయనున్నట్లు చెప్పారు.

**6.70 లక్షల ఎకరాలపై సౌర విద్యుత్**

గిరిజన ప్రాంతాల్లో ఫారెస్ట్ రైట్స్ యాక్ట్ కింద గతంలో పంపిణీ చేసిన సుమారు 6.70 లక్షల ఎకరాల భూములను కూడా సౌర విద్యుత్ ప్రోత్సాహానికి వినియోగించే అవకాశాలను పరిశీలిస్తున్నట్లు భట్టి తెలిపారు. 'ఇందిరా సౌర గిరి జల వికాసం' పేరుతో పథకాన్ని అమలు చేయాలని నిర్ణయించామని చెప్పారు. సాధ్యమైన ప్రాంతాల్లో సోలరైజేషన్, ఫ్లోటింగ్ సోలార్ ప్రాజెక్టులను చేపడతామని స్పష్టం చేశారు.

**సోలార్ ప్లాంట్లకు రైతులు ముందుకు రావాలి**

రైతులు, ప్రజలు సౌర విద్యుత్ ఉత్పత్తిపై అవగాహన పెంచుకోవాలని భట్టి కోరారు. గ్రామాల్లో సోలార్ పవర్ ప్లాంట్ల ఏర్పాటుకు ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని, ఈ అవకాశాలపై రైతులకు ఎమ్మెల్యేలు అవగాహన కల్పించాలని సూచించారు. పెద్ద సంఖ్యలో దరఖాస్తులు వచ్చేలా ప్రజలను ప్రోత్సహించాలని ఎమ్మెల్యేలకు విజ్ఞప్తి చేశారు.

# చాకలి ఐలమ్మ స్ఫూర్తిగా టీఆర్ఎస్ పోరాటం

- పార్టీ నాయకులు సయ్యద్ ఇస్మాయిల్, నవీన్ ఆచారి

**వాస్తవదర్పణం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, సెప్టెంబర్ 10:** దొరల పాలనకు వ్యతిరేకంగా పోరాటం చేసిన వీరనారి చాకలి ఐలమ్మ స్ఫూర్తిగా సర్వోదయ తెలంగాణ కోసం తెలంగాణ రక్షణ సేన పోరాటం చేస్తుందని పార్టీ నాయకులు సయ్యద్ ఇస్మాయిల్, నవీన్ ఆచారి అన్నారు. గురువారం చాకలి ఐలమ్మ వర్ధంతి సందర్భంగా బంజారాహిల్స్ లోని పార్టీ కార్యాలయంలో పార్టీ నాయకులతో కలిసి వారి చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ...దొరల పాలనకు వ్యతిరేకంగా భూమి, భుక్తి, విముక్తి కోసం చాకలి ఐలమ్మ చేసిన పోరాటం ప్రతి ఒక్కరికీ ఆదర్శమన్నారు. ఆమె స్ఫూర్తితోనే సర్వోదయ తెలంగాణ కోసం కవిత ముందడుగు వేస్తున్నారన్నారు. అప్పట్లో దొరలు, దేశ్ ముఖ్ ల దుర్మార్గ పాలన సాగితే...ఇప్పుడు నయా హిట్లర్ల రూపంలో అదే పాలన సాగుతుందని చెప్పారు.



# ద్రౌపదికి జరిగిన అవమానమే మాకు జరిగింది

- మహిళా ఎమ్మెల్యేల పట్ల పోలీసులు అమానుషంగా వ్యవహరించారు
- నా గొంతు పట్టుకున్నారు.. సునీతారెడ్డి చీర లాగారు
- ఫిర్యాదు చేస్తే మాపైనే కేసులా?.. చర్యలు తీసుకోవాలి
- మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి



**వాస్తవదర్పణం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, సెప్టెంబర్ 10:** అసెంబ్లీకి వెళ్తున్న తమను పోలీసులు అడ్డుకుని అమానుషంగా వ్యవహరించారని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి ఆరోపించారు. "ఆనాడు ద్రౌపదికి జరిగిన అవమానమే మాకు జరిగింది" అని ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం సైఫాబాద్ పోలీస్‌స్టేషన్ వద్ద నిర్వహించిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడారు. బీజేపీ నాయకులు ప్లకార్డులు పట్టుకుని అసెంబ్లీకి వచ్చినా అనుమతించి, తాము నల్ల షర్టులు ధరించినందుకు ఎందుకు అడ్డుకున్నారని ప్రశ్నించారు. తమను అడ్డుకునేందుకు సుమారు 500 మంది పోలీసులను మోహరించారని ఆరోపించారు. తాము అక్కడికి రాగానే మహిళా పోలీసులను తప్పించి పురుష పోలీసులను మోహరించారని తెలిపారు.

**నా గొంతు పట్టుకున్నారు.. చీర లాగారు**

తమను రౌడీల మాదిరిగా రోడ్డుపైనే అడ్డుకున్నారని సబితా ఇంద్రారెడ్డి ఆరోపించారు. తన గొంతు పట్టుకున్నారని, ఎమ్మెల్యే సునీతారెడ్డి చీర లాగారని పేర్కొన్నారు. మహిళా సభ్యుల వద్ద పురుష పోలీసులను, పురుష సభ్యుల వద్ద మహిళా పోలీసులను ఎందుకు మోహరించారో ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. తమపై పోలీసుల వ్యవహారశైలిని ముఖ్యమంత్రి ఇప్పటివరకు ప్రశ్నించకపోవడం బాధాకరమన్నారు. తమను అడ్డుకోవాలని ఎవరు ఆదేశించారో వెల్లడించాలని కోరారు. కమాండ్ కంట్రోల్‌కు ఫిర్యాదు చేసినా ఇప్పటివరకు స్పందన లేదన్నారు.

**ఫిర్యాదు చేస్తే మాపైనే కేసులా?**

తాము పోలీసులకు ఫిర్యాదు చేసినందుకు తమపైనే కేసులు పెట్టారని సబిత ఆరోపించారు. 14 మందిపై అక్రమంగా కేసులు నమోదు చేశారని తెలిపారు. స్పీకర్‌ను తానేమీ అనలేదని తమ సభ్యుడు స్పష్టం చేసినా పోలీసులు పట్టించుకోలేదన్నారు. అసెంబ్లీలో కాంగ్రెస్ సభ్యులు పలుమార్లు "దళిత స్పీకర్" అంటూ వ్యాఖ్యలు చేశారని పేర్కొన్నారు. మహిళా ఎమ్మెల్యేలకే రక్షణ లేకపోతే సామాన్య మహిళల పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. తమ పట్ల అమానుషంగా వ్యవహరించిన పోలీసులపై చర్యలు తీసుకోవాలని, తాము ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.

**కేసీఆర్ ఇంటి ముందు చావు డప్పులా?**

మాజీ సీఎం కేసీఆర్ ఇంటి ముందు చావు డప్పు కొట్టడంపైనా సబిత తీవ్రంగా స్పందించారు. తెలంగాణను దేశంలోనే అగ్రగామి రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు పనిచేసిన కేసీఆర్ చావును కోరుకోవడం దౌర్భాగ్యమన్నారు. కేసీఆర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఎమ్మెల్యేపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి హుందాగా వ్యవహరించాలని, శాంతిభద్రతలను కాపాడాల్సిన బాధ్యత ఉన్న సీఎం పరిస్థితులను మరింత ఉద్రిక్తం చేసేలా వ్యవహరించకూడదని సబితా ఇంద్రారెడ్డి సూచించారు.

# ఆమ్యామ్యాలకు అలవాటుపడి... అక్రమాలకు వత్తాసు!?

- అనుమతులు లేని పాఠశాలలపై ఫిర్యాదులను పట్టించుకోరు!
- గోల్కొండ మండల విద్యాధికారుల తీరు ఇది
- టోలిచౌకిలో గ్రీన్ విడోస్ పార్క్ స్కూల్‌పై తీవ్ర ఆరోపణలు
- అనుమతులు లేవు.. అయినా 10 వరకు తరగతులు!
- నిబంధనలు ఉల్లంఘిస్తూ నూతన బ్రాంచ్ నిర్వహణ
- వేల రూపాయల ఫీజుల వసూలు?
- విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని చర్యలు తీసుకోవాలని డిమాండ్



వాస్తవ దర్పణం

అనుమతులు లేవు.. అయినా 10 వరకు తరగతులు!

టోలిచౌకిలో గ్రీన్ విడోస్ పార్క్ స్కూల్‌పై ఆరోపణలు

**వాస్తవదర్పణం, హైదరాబాద్:** గోల్కొండ మండల విద్యాధికారులు ఆమ్యామ్యాలకు అలవాటుపడి అక్రమాలకు వత్తాసు పలుకుతున్నారని మండలంలోని అనుమతి లేని పాఠశాలలను చూస్తే ఇట్టే తెలిసిపోతోంది. అక్రమ పాఠశాలలు అనుమతి లేకుండా తరగతులు నిర్వహిస్తున్నారు.. దీనిపై ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి... పత్రికల్లో కథనాలు వస్తూనే ఉన్నాయి.. అయినా అధికారుల్లో ఎలాంటి చలనం లేకపోవడం గమనార్హం. చర్యలు తీసుకోవాల్సిన అధికారులు అక్రమ పాఠశాలల వైపు కన్నెత్తి చూడడం లేదంటేనే అక్కడ అవినీతి రాజ్యమేలుతుందనేది స్పష్టమవుతోంది.

**అసలేం జరిగింది....**


హైదరాబాద్ జిల్లా గోల్కొండ మండలం టోలిచౌకి ప్రాంతంలో నిర్వహిస్తున్న గ్రీన్ విడోస్ పార్క్ స్కూల్‌పై విద్యా నిబంధనల ఉల్లంఘనకు సంబంధించిన ఆరోపణలు వెలువడుతున్నాయి. పాఠశాలకు అవసరమైన అనుమతులు లేకుండానే నర్సరీ నుంచి పదో తరగతి వరకు తరగతులు నిర్వహిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. అంతేకాకుండా టోలిచౌకి ప్రాంతంలో నూతన బ్రాంచ్‌ను ఏర్పాటు చేసి, విద్యా శాఖ అనుమతులు, గుర్తింపు తదితర నిబంధనలను పాటించకుండా విద్యాబోధన కొనసాగిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. పాఠశాలలో విద్యార్థుల నుంచి వేల రూపాయల ఫీజులు వసూలు చేస్తున్నప్పటికీ, విద్యా శాఖ నిర్దేశించిన నిబంధనలు మాత్రం అమలు చేయడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. ఒక బ్రాంచ్‌కు సంబంధించిన అనుమతులను మరో బ్రాంచ్‌లో ఉపయోగిస్తూ పదో తరగతి వరకు తరగతులు నిర్వహిస్తున్నారనే ఆరోపణలు కూడా ఉన్నాయి. అనుమతులు, గుర్తింపు, భవన భద్రత, మౌలిక వసతులు తదితర అంశాలపై సంబంధిత అధికారులు సమగ్రంగా తనిఖీ చేయాల్సిన అవసరం ఉందని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. అనుమతులు లేకుండా తరగతులు నిర్వహిస్తున్నట్లు తేలితే విద్యా చట్టాల ప్రకారం చర్యలు తీసుకోవాలని, విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడే పరిస్థితులకు అడ్డుకట్ట వేయాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు. ఈ వ్యవహారంపై గోల్కొండ మండల విద్యాశాఖ అధికారులు తక్షణమే స్పందించి పాఠశాలను తనిఖీ చేసి, అనుమతులు, తరగతుల నిర్వహణ, ఫీజుల వసూలు, మౌలిక వసతులు తదితర అంశాలపై వాస్తవాలను వెలికితీయాలని కోరుతున్నారు.

**నిబంధనలు ఏం చెబుతున్నాయి...**

ప్రభుత్వ నిబంధనల ప్రకారం పాఠశాలకు మంజూరైన అనుమతి ఏ తరగతుల వరకు ఉందో, ఆ పరిధిలోనే తరగతులు నిర్వహించాలి; అదనపు తరగతులను ప్రారంభించాలంటే సంబంధిత అధికారుల నుంచి అవసరమైన అనుమతి, గుర్తింపు పొందాలి. 1993 నాటి ప్రైవేటు పాఠశాలల స్థాపన, గుర్తింపు, నిర్వహణ నిబంధనలు ప్రస్తుతం తెలంగాణలోనూ వర్తించే నిబంధనలుగా ప్రభుత్వ పోర్టల్‌లో పేర్కొనబడ్డాయి. అలాగే RTE చట్టంలోని సెక్షన్ 18 ప్రకారం గుర్తింపు ధ్రువీకరణ లేకుండా ప్రైవేటు పాఠశాలను నిర్వహించకూడదు. పాఠశాలలకు భవనం, మౌలిక వసతులు, తగిన వసతి వంటి ప్రమాణాలు కూడా పాటించాల్సి ఉంటుంది. అదనంగా తెలంగాణ ప్రభుత్వం పాఠశాలల్లో ఫైర్ సేఫ్టీ చర్యలకు సంబంధించి ప్రత్యేక నిబంధనలు జారీ చేసింది. కాబట్టి ఒక పాఠశాలకు అనుమతి ఉన్న తరగతుల కంటే అదనంగా తరగతులు నిర్వహిస్తున్నారా, భవనమౌలిక వసతులు, అగ్నిమాపక భద్రతా ప్రమాణాలు పాటిస్తున్నారా అనే అంశాలను విద్యాశాఖ అధికారులు తనిఖీ చేసి, ఉల్లంఘనలు తేలితే నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది.

# 17 లక్షల మందికి 'ఎన్ఈహెచ్ఎస్'

- జూలై 17 నుంచి అమలు
- 921 ఆసుపత్రుల్లో వైద్య సేవలు
- ఏటా రూ.1,056 కోట్ల బడ్జెట్
- ఆరోగ్యమంత్రి దామోదర్ రాజనర్సింహ



**వాస్తవదర్పణం, స్టేట్ బ్యూరో, హైదరాబాద్, సెప్టెంబర్ 10:** రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లు, వారి కుటుంబ సభ్యులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు నూతన ఉద్యోగుల ఆరోగ్య పథకం (ఎన్ఈహెచ్ఎస్) అమల్లోకి తెచ్చినట్లు ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ తెలిపారు. గురువారం శాసన మండలిలో ఎమ్మెల్సీలు అడిగిన ప్రశ్నలకు సమాధానమిచ్చిన ఆయన.. జూలై 17 నుంచి ఈ పథకం అమల్లోకి వచ్చిందని వెల్లడించారు. చీఫ్ సెక్రటరీ అధ్యక్షతన నూతన ఈహెచ్ఎస్ ట్రస్ట్ (ఈహెచ్‌సీటీ) ఏర్పాటు చేసినట్లు తెలిపారు. 30 మంది సభ్యులతో కూడిన ట్రస్ట్‌లో ఉద్యోగ సంఘాల నుంచి 10 మంది, పెన్షనర్ సంఘాల నుంచి ముగ్గురు, ప్రభుత్వం నుంచి 16 మంది సభ్యులు ఉన్నారని చెప్పారు.

**నెలకు రూ.88 కోట్ల సమీకరణ**

ఉద్యోగులు, పెన్షనర్లు తమ బేసిక్ పే లేదా చివరిగా పొందిన పెన్షన్‌లో 1.5 శాతం చొప్పున నెలవారీగా చెల్లిస్తుండగా.. అంతే మొత్తాన్ని ప్రభుత్వం కూడా సమకూరుస్తోందని మంత్రి తెలిపారు.

**921 ఆసుపత్రుల్లో చికిత్స**

ఎన్ఈహెచ్ఎస్ పరిధిలో 921 ఆసుపత్రుల్లో ఇన్‌పేషెంట్ వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయని మంత్రి తెలిపారు. వీటిలో 114 ప్రభుత్వ, 807 ప్రైవేట్ ఆసుపత్రులు ఉన్నాయని చెప్పారు. ఓపీ వైద్యం, వైద్య పరీక్షలు, మందుల కోసం ప్రస్తుతం 12 జిల్లాల్లో 12 వెల్‌నెస్ కేంద్రాలు పనిచేస్తున్నాయని తెలిపారు.

**8,511 కేసులకు రూ.55.14 కోట్లు**

పథకం ప్రారంభమైన తర్వాత ఇప్పటివరకు 8,511 కేసులకు రూ.55.14 కోట్ల ప్రీఆథరైజేషన్ ఇచ్చినట్లు దామోదర్ రాజనర్సింహ తెలిపారు.

# ఆన్లైన్ బెట్టింగ్ వద్దు, ఆత్మహత్యలు కావద్దు

- డీజీపీ సీవీ ఆనంద్ సూచన
- ఆన్లైన బెట్టింగ్తో ఇద్దరు ఆత్మహత్య
- ప్రపంచ ఆత్మహత్యల నివారణ దినోత్సవం
- పోలీసులు, ప్రజలకు డీజీపీ సూచనలు



**వాస్తవదర్పణం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, సెప్టెంబర్10 :** ఆన్ లైన బెట్టింగ్ తో అప్పుల పాలై ప్రాణాలు తీసుకోవద్దని తెలంగాణ డీజీపీ సి.వి. ఆనంద్ పోలీసు సిబ్బందికి, ప్రజలకు సూచించారు. ప్రపంచ ఆత్మహత్యల నివారణ దినోత్సవం గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఆన్‌లైన్ బెట్టింగ్‌కు బానిసై అప్పులపాలై కొందరు పోలీసులు ఆత్మహత్యలకు పాల్పడుతున్న ఘటనలు తనను తీవ్రంగా కలచివేశాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. గత నాలుగు నెలల్లో పోలీస్ శాఖకు చెందిన ఇద్దరు సిబ్బంది ఆత్మహత్యలకు పాల్పడటం, యువ కానిస్టేబుళ్లు ప్రాణాలు తీసుకోవడం ఆందోళనకరమన్నారు.ఈ ఘటనలపై విచారణ చేపట్టగా ఆన్‌లైన్ బెట్టింగ్ మూలంగానే అప్పులపాలైనట్లు తేలిందన్నారు. కొందరు భూములు అమ్ముకోగా మరికొందరు స్నేహితులు, సహోద్యోగుల వద్ద, అధిక వడ్డీలకు అప్పులు చేసి చిక్కుల్లో పడ్డారని డీజీపీ వివరించారు.

**ఒత్తిడితో ప్రాణాలు..:** అప్పులు ఇచ్చిన వారి ఒత్తిడితో మానసిక ఒత్తిడికి గురవుతున్న సిబ్బంది, తమ ఆర్థిక సమస్యలను జీవిత భాగస్వాములు, కుటుంబ సభ్యులకు చెప్పకుండా దాచిపెట్టడం వల్ల పరిస్థితి దిగజారుతోందని ఆయన తెలిపారు. ఆర్థిక ఇబ్బందులు వస్తే వాటిని కుటుంబంతో పంచుకోవాలని, ఆత్మహత్యే సమస్యకు పరిష్కారం కాదని హితవు పలికారు. బెట్టింగ్‌లతో పాటు మాదకద్రవ్యాలు, ఇతర వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. ఏవైనా సమస్యలు ఎదురైతే భయపడకుండా వెంటనే ఉన్నతాధికారులను సంప్రదించి పరిష్కారం పొందాలని సూచించారు.

**కుటుంబాలను మరువద్దు**

రాష్ట్రంలోని మొత్తం 93 వేల మంది పోలీసు సిబ్బందిని ఉద్దేశించి డీజీపీ ఈ సందేశం ఇస్తూ, తమపై పూర్తిగా ఆధారపడి ఉన్న భార్యాపిల్లలను, తల్లిదండ్రులను క్షోభకు గురిచేయవద్దని కోరారు. మీరు లేకపోతే మీ కుటుంబ బాగోగులు ఎవరు చూస్తారంటూ భావోద్వేగంతో ప్రశ్నించిన ఆయన, ఎలాంటి క్లిష్ట పరిస్థితుల్లోనైనా ఆత్మహత్యలకు పాల్పడకుండా ధైర్యంగా జీవించాలని సిబ్బందికి పిలుపునిచ్చారు.

# 'ఫీజు' బకాయిలు 8,591.62 కోట్లు

- ఆశ్రమ పాఠశాలల పండిట్, పీఈటీల పోస్టుల అప్‌గ్రేడేషన్‌పై పరిశీలన
- శాసనమండలిలో సభ్యుల ప్రశ్నలకు మంత్రి అడ్లూరి జవాబు



**వాస్తవదర్పణం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, సెప్టెంబర్ 10 :** రాష్ట్రంలోని విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు, ఆశ్రమ పాఠశాలల్లో పనిచేస్తున్న పండిట్లు, వ్యాయామ విద్యా ఉపాధ్యాయుల పోస్టుల అప్‌గ్రేడేషన్‌కు సంబంధించిన అంశాలపై సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ గురువారం శాసనమండలిలో ఎమ్మెల్సీలు అడిగిన ప్రశ్నలకు సమాధానమిచ్చారు. శాసన మండలి ప్రశ్నోత్తరాల సమయంలో ఎమ్మెల్సీలు తీన్మార్ మల్లన్న , తక్కెళ్ళపల్లి రవీందర్ రావ్ , సత్యం నెలికంటి అడిగిన ప్రశ్నలకు మంత్రి అడ్లూరి సమాధానమిచ్చారు. విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ ట్ బకాయిల పరిస్థితి గురించి ప్రస్తావిస్తూ.. 2025-26 విద్యా సంవత్సరం వరకు ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈబీసీ, మైనారిటీ, దివ్యాంగ విద్యార్థులకు సంబంధించి బకాయిలు రూ.8,591.62 కోట్లు ఉన్నాయని తెలిపారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల కాకపోవడంతో ప్రైవేటు కళాశాలలు విద్యార్థులకు సర్టిఫికెట్లు జారీ చేయడానికి వారి నుంచి ఫీజులు వసూలు చేస్తున్నాయన్న అంశంపై సభ్యులు అడిగిన ప్రశ్నకు మంత్రి స్పందిస్తూ, అటువంటి పరిస్థితి లేదని స్పష్టం చేశారు. అక్రమంగా ఫీజులు వసూలు చేస్తున్న ప్రైవేటు కళాశాలలపై చర్యలకు సంబంధించిన తదుపరి ప్రశ్న ఉత్పన్నం కాదని తెలిపారు. టీచర్ ఎమ్మెల్సీ శ్రీపాల్ రెడ్డి అడిగిన ఆశ్రమ పాఠశాలల్లోని పండిట్లు, పీఈటీల పోస్టులను స్కూల్ అసిస్టెంట్లుగా అప్‌గ్రేడ్ చేసే అంశంపై సమాధానం ఇస్తూ... ఈ అంశం ప్రస్తుతం ప్రభుత్వ పరిశీలనలో ఉందని తెలిపారు. ఈ ప్రతిపాదనపై సాధ్యమైనంత త్వరగా తగిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. విద్యార్థుల సంక్షేమం, విద్యా రంగానికి సంబంధించిన సమస్యల పరిష్కారంతో పాటు ఆశ్రమ పాఠశాలల్లో పనిచేస్తున్న సిబ్బంది అంశాలపైనా ప్రభుత్వం సానుకూలంగా స్పందిస్తూ చర్యలు తీసుకుంటోందని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తెలిపారు.



# సచివాలయంలో ఏసీబీ దాడి

- సెక్షన్ ఆఫీసర్ సహా ఇద్దరి అరెస్ట్
- సీఎంఆర్ఎఫ్ నిధుల కోసం రూ. రెండు లక్షల లంచం

**వాస్తవదర్పణం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, సెప్టెంబర్10 :** రాష్ట్ర సచివాలయంలో అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు ఆకస్మిక సోదాలు నిర్వహించి లంచం తీసుకుంటున్న ఇద్దరిని రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) మంజూరు విషయంలో దాదాపు రెండు లక్షల రూపాయల సహాయం కోసం సచివాలయంలోని సెక్షన్ ఆఫీసర్ వినోద్ లక్ష రూపాయల లంచం డిమాండ్ చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పక్కా వ్యూహంతో రంగంలోకి దిగిన ఏసీబీ బృందం, సచివాలయ ఆవరణలోని ఆలయం సమీపంలో లక్ష రూపాయల నగదు తీసుకుంటుండగా వారిని రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు.. ఈ వ్యవహారంలో సెక్షన్ ఆఫీసర్ వినోద్‌తో పాటు అతనికి సహకరించిన ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి రాఘవేంద్రను అధికారులు అదుపులోకి తీసుకున్నారు. అనంతరం ఇద్దరినీ నాంపల్లిలోని ఏసీబీ ప్రధాన కార్యాలయానికి తరలించి సమగ్ర విచారణ చేపట్టారు. ఈ కేసుకు సంబంధించి పూర్తి సమాచారం రాబట్టేందుకు అధికారులు దర్యాప్తును కొనసాగిస్తున్నారు.



## వీరనారి చాకలి ఐలమ్మ బహుజన సాయుధ పోరాట పటిమకు నిత్య స్ఫూర్తి

- చైర్మన్ తంగళ్ళపల్లి శ్రీవాణి రవికుమార్

**వాస్తవ దర్పణం సెప్టెంబర్ 10 యాదాద్రి ప్రతిని-ధి:** వీరనారి చాకలి ఐలమ్మ బహుజన పోరాట ప్రతిమకు తెలంగాణ సాయుధ పోరాటానికి నిత్య స్ఫూర్తిదాయకం మని మున్సిపల్ చైర్మన్ తంగళ్ళపల్లి శ్రీవాణి రవికుమార్ అన్నారు.చాకలి ఐలమ్మ వర్ధంతి సందర్భంగా భువనగిరి మున్సిపల్ చైర్ పర్సన్ తంగళ్ళపల్లి శ్రీవాణి రవికుమార్ ఆమె చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... నిజాం నిరంకుశ పాలనలో, రజాకార్ల అరాచకాలను ఎదిరించి, తన సొంత భూమి కోసం రోకలి బండను ఆయుధంగా చేసుకొని పోరాడిన ధీర వనిత చాకలి ఐలమ్మ అని కొనియాడారు. ఆకలి కడుపులకు అండగా నిలబడి, పేద ప్రజల హక్కుల కోసం జీవితాంతం పోరాడిన ఆమె జీవితం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని అన్నారు. తెలంగాణ ఉద్యమంలో, భూపోరాటంలో ఆమె చూపిన తెగువను ఎప్పటికీ మరువలేమని తెలిపారు. ఆమె ఆశయాలను కొనసాగించడమే ఆమెకు మనం ఇచ్చే నిజమైన నివాళి అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గౌరవ మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ శ్రీమతి పోతంశెట్టి మంజుల వెంకటేశ్వర్లు, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

# అధికారులూ.. కళ్లు మూసుకున్నారా?

- 'మేధావి' అక్రమ తరగతులపై చర్యలేవి?
- ఫిర్యాదు చేసినా పట్టించుకోరా!?
- పత్రికల్లో కథనాలు వచ్చినా చలనం లేదా?
- అనుమతులు ఒకటి నుంచి ఏడో తరగతి వరకే...
- బోధన మాత్రం పదో తరగతి వరకు!
- డబ్బాల్లాంటి కమర్షియల్ భవనంలో.. సౌకర్యాలూ కరువు
- ఫైర్ సేఫ్టీ ప్రమాణాలు పాటించడం లేదు!
- సంతోష్‌నగర్ మేధావి స్కూల్‌లో విద్యా నిబంధనల ఉల్లంఘనలపై ఆరోపణలు
- తెలిసీ కళ్లు మూసుకుంటున్న అధికారులు
- చర్యల కోసం విద్యా సంఘాల డిమాండ్

**వాస్తవదర్పణం, హైదరాబాద్ :**

అక్రమంగా అనుమతులు లేకుండా పాఠశాలలు నిర్వహిస్తున్నా.. అధికారులకు మాత్రం ఇవేమీ కనబడటం లేదు... బహుశా వారు కళ్లు మూసుకుని డ్యూటీ చేస్తున్నారేమో!! 7వ తరగతి వరకే అనుమతులు... డబ్బాల్లాంటి భవనాలు.. సౌకర్యాలు కరువు.. ఫైర్ సేఫ్టీ లేదు... విద్యార్థుల భద్రత ఇక్కడ ప్రశ్నార్థకం.. ఇంత దారుణం జరుగుతున్నా స్థానిక విద్యాశాఖ అధికారులకు మాత్రం చీమకుట్టినట్టు కూడా లేకపోవడం దారుణం. సంతోష్‌నగర్‌లోని మేధావి స్కూల్ విద్యాశాఖ అనుమతులు ఒకటి నుంచి ఏడో తరగతి వరకు మాత్రమే పొందినప్పటికీ, గుట్టుచప్పుడు కాకుండా పదో తరగతి వరకు తరగతులు నిర్వహిస్తున్నట్లు తీవ్ర ఆరోపణలు వెలువడుతున్నాయి. విద్యా నిబంధనలను ఉల్లంఘిస్తూ పాఠశాల నిర్వహణ కొనసాగుతోందని, దీనిపై సంబంధిత అధికారులు తక్షణమే విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని విద్యా సంఘాల నాయకులు డిమాండ్ చేస్తున్నారు. విద్యా సంఘాల ప్రతినిధుల ఆరోపణల ప్రకారం, పాఠశాల కమర్షియల్ భవనంలోనే కార్యకలాపాలు నిర్వహిస్తూ, ఫైర్ సేఫ్టీ నిబంధనలను పాటించడం లేదని చెబుతున్నారు. అత్యవసర పరిస్థితుల్లో విద్యార్థులు సురక్షితంగా బయటకు వచ్చే మార్గాలు, అగ్నిమాపక పరికరాలు, భద్రతా ప్రమాణాలు లేకుండా ఇరుకైన డబ్బా తరహా భవనంలో తరగతులు నిర్వహించడం విద్యార్థుల ప్రాణాలకు ముప్పుగా మారే అవకాశముందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అనుమతులు లేని తరగతులను నిర్వహించడం ద్వారా ప్రభుత్వం నిర్దేశించిన విద్యా చట్టాలను ఉల్లంఘించడమే కాకుండా ప్రభుత్వ ఆదాయానికీ గండి కొడుతున్నారని ఆరోపిస్తున్నారు. ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపి, నిబంధనలు ఉల్లంఘించినట్లు తేలితే మేధావి స్కూల్ అనుమతులను రద్దు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని విద్యా సంఘాలు కోరుతున్నాయి. ఇంత జరుగుతున్నప్పటికీ సైదాబాద్ మండల విద్యాశాఖ అధికారులకు ఈ విషయం తెలియకుండా ఉండటం పలు అనుమానాలకు తావిస్తోందని, అధికారుల కళ్లుగప్పి ఈ తంతు కొనసాగుతోందని విద్యా సంఘాల నాయకులు విమర్శిస్తున్నారు. విద్యార్థుల భద్రత, విద్యా ప్రమాణాల పరిరక్షణ దృష్ట్యా సైదాబాద్ మండల విద్యాశాఖ అధికారులు వెంటనే పాఠశాలను తనిఖీ చేసి, వాస్తవాలను వెలికితీసి, నిబంధనల ఉల్లంఘనలపై కఠిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.

**నిబంధనలు ఏం చెబుతున్నాయి..?**

ప్రభుత్వ నిబంధనల ప్రకారం పాఠశాలకు మంజూరైన అనుమతి ఏ తరగతుల వరకు ఉందో, ఆ పరిధిలోనే తరగతులు నిర్వహించాలి; అదనపు తరగతులను ప్రారంభించాలంటే సంబంధిత అధికారుల నుంచి అవసరమైన అనుమతి, గుర్తింపు పొందాలి. 1993 నాటి ప్రైవేటు పాఠశాలల స్థాపన, గుర్తింపు, నిర్వహణ నిబంధనలు ప్రస్తుతం తెలంగాణలోనూ వర్తించే నిబంధనలుగా ప్రభుత్వ పోర్టల్‌లో పేర్కొనబడ్డాయి. అలాగే RTE చట్టంలోని సెక్షన్ 18 ప్రకారం గుర్తింపు ధ్రువీకరణ లేకుండా ప్రైవేటు పాఠశాలను నిర్వహించకూడదు. పాఠశాలలకు భవనం, మౌలిక వసతులు, తగిన వసతి వంటి ప్రమాణాలు కూడా పాటించాల్సి ఉంటుంది. అదనంగా తెలంగాణ ప్రభుత్వం పాఠశాలల్లో ఫైర్ సేఫ్టీ చర్యలకు సంబంధించి ప్రత్యేక నిబంధనలు జారీ చేసింది. కాబట్టి ఒక పాఠశాలకు అనుమతి ఉన్న తరగతుల కంటే అదనంగా తరగతులు నిర్వహిస్తున్నారా, భవనమౌలిక వసతులు, అగ్నిమాపక భద్రతా ప్రమాణాలు పాటిస్తున్నారా అనే అంశాలను విద్యాశాఖ అధికారులు తనిఖీ చేసి, ఉల్లంఘనలు తేలితే నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది.




## గణేష్ నవరాత్రుల నేపథ్యంలో శాంతి కమిటీ సమావేశం

**వాస్తవ దర్పణం, గుండాల, సెప్టెంబర్ 10 :** రానున్న గణేష్ చతుర్థి, వినాయక నవరాత్రుల సందర్భంగా గ్రామాల్లో శాంతిభద్రతల పరిరక్షణకు గుండాల పోలీస్ శాఖ ముందస్తు చర్యలు చేపడుతోంది. ఇందులో భాగంగా గణేష్ మండపాల ఏర్పాటు, విద్యుత్, లైటింగ్ ఏర్పాట్లు, వినాయక విగ్రహాల ఊరేగింపులు తదితర అంశాలపై చర్చించేందుకు శాంతి కమిటీ సమావేశాన్ని నిర్వహించనున్నట్లు పోలీసులు తెలిపారు. DSP పర్యవేక్షణలో MRO, MPDO, R&B AE, విద్యుత్ శాఖ AEల సమన్వయంతో ఈ సమావేశం జరగనుంది. ఎల్లుండి లేదా మరుసటి రోజు సమావేశం నిర్వహించే అవకాశం ఉందని, తేదీ, సమయం, వేదిక వివరాలను త్వరలో వెల్లడిస్తామని పోలీసులు తెలిపారు. గ్రామ సర్పంచ్‌లు, ఉప సర్పంచ్‌లు, వార్డు సభ్యులు సమావేశానికి అందుబాటులో ఉండాలని గుండాల పోలీస్ శాఖ ముందస్తుగా సూచించింది.

## సీఎంఆర్ఎఫ్ ద్వారా లక్ష్మణ్‌కు రూ.19 వేల ఆర్థిక సహాయం

**వాస్తవ దర్పణం, ఉప్పల్, సెప్టెంబర్ 10:** వెంకట సాయి నగర్ కాలనీకి చెందిన శ్రీ లక్ష్మణ్‌కు శస్త్రచికిత్స అనంతరం వైద్య ఖర్చుల నిమిత్తం ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) ద్వారా రూ.19,000 ఆర్థిక సహాయం మంజూరైంది. ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ప్రత్యేక చొరవ, సహకారంతో ఈ ఆర్థిక సహాయం అందింది. మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కును కాలనీ అధ్యక్షుడు విజయేందర్ రెడ్డి, గౌరవ సభ్యులు, టీమ్ సభ్యులు కలిసి లక్ష్మణ్‌కు అందజేశారు. ఈ సందర్భంగా కాలనీ అధ్యక్షుడు విజయేందర్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ, అవసరమైన సమయంలో వారికి అండగా నిలుస్తున్న ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి సేవలు అభినందనీయమన్నారు. పేద, మధ్యతరగతి కుటుంబాలకు వైద్య చికిత్స సమయంలో సీఎంఆర్ఎఫ్ వంటి ప్రభుత్వ సహాయం అందేలా ఎమ్మెల్యే చేస్తున్న కృషి ప్రశంసనీయమని తెలిపారు. లక్ష్మణ్ కుటుంబానికి ఆర్థికంగా కొంత ఊరట కలిగేలా సీఎంఆర్ఎఫ్ సహాయం అందేందుకు సహకరించిన ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డికి కాలనీ తరఫున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఇప్పటివరకు కాలనీ అసోసియేషన్ ద్వారా నలుగురు సీఎంఆర్ఎఫ్ లబ్ధిదారులకు సహాయం అందించినట్లు విజయేందర్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో గౌరవ సభ్యులు రవికుమార్, గోపాల్, సంజీవ, శంకర్, ఆర్. గోవింద్, అశోక్, శ్రీనివాస్ గౌడ్, భూపతి నరసింహ, రామకృష్ణ, సి. శేఖర్, స్వామి, నరేష్, బి. చలపతి రావు, వేణుగోపాల్, ఐలేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.






## అంగన్వాడి కేంద్రంలో గర్భిణీ స్త్రీలకు పోషక ఆహారము అవగాహన

**వాస్తవ దర్పణం, గుండాల, సెప్టెంబర్ 10 :** యాదాద్రి భువనగిరి జిల్లాలోని గుండాల మండలంలోనిగంగాపురం గ్రామంలో అంగన్వాడి ఆధ్వర్యంలో పోషణ ఆహార కార్యక్రమాలు నిర్వహించడం జరిగింది . ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా సర్పంచ్ ఖాళీ మంజుల మాట్లాడుతూ గర్భవతులు బాలింతలు పౌష్టికాహారం తీసుకోని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని మరియు బిడ్డ యొక్క 1000. రోజులప్రాముఖ్యత గురించి వివరించడం జరిగింది . తమ ఆహారంలో,పాలు పండ్లు గుడ్లు కూరగాయలు ఆకుకూరలు కచ్చితంగా తీసుకొని. తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషక విలువలు గల ఆహార పదార్థాలను తీసుకొని తీసుకోని,తమ యొక్క ఆరోగ్యాన్ని మరియు బిడ్డ యొక్క ఆరోగ్యాన్ని కాపాడవలసిన బాధ్యత తల్లిదండ్రులపై ఉన్నదని వివరించనైనది . ప్రతి నెల అంగన్వాడి కేంద్రంలో బిడ్డ పెరుగుదలను, గమనించి బిడ్డ ఎత్తుకు తగ్గ బరువు పెరిగేలా తగు సూచనలు పాటించాలని, వివరించారు. సూపర్ వైజర్ మాట్లాడు తూ.చిన్న పిల్లల కు జంకు ఫుడ్ పెద్దకూడదు అని. తిన వలసిన ఫుడ్ మరియు తినకూడనివి ఎగ్జిబిషన్ ద్వారా చూపిస్తూ వివరించనైనది అందరు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని , బాలామృతంను బిడ్డకు తగు శ్రద్ధతో తినిపించాలని తగు సూచనలు ఇవ్వడం జరిగింది . ఈ కార్యక్రమంలో సంఘ బంధం అధ్యక్షురాలు, టీ వాణి. మరియు సూపర్వైజర్ ఎండి షమీం,అంగన్వాడి టీచర్ టీ యాదలక్ష్మి, ఆశ ఫరీదా మరియు గర్భవతులు, తల్లులు పాల్గొన్నారు





## బానిసత్వానికి చరమగీతం పాడిన వీరనారి చాకలి ఐలమ్మ

- చాకలి ఐలమ్మ కేవలం ఒక పేరు కాదు.. ఆమె ఒక చరిత్ర: మాజీ కార్పొరేటర్ బన్నాల గీత

**వాస్తవ దర్పణం, చిల్కానగర్, సెప్టెంబర్ 10:** భూమి కోసం, భుక్తి కోసం, వెట్టిచాకిరీ విముక్తి కోసం, అణగారిన వర్గాల ఆత్మగౌరవం కోసం వీరోచితంగా పోరాడిన వీరనారి చాకలి చిట్యాల ఐలమ్మ అని చిల్కానగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్, జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యురాలు బన్నాల గీత ప్రవీణ్ ముదిరాజ్ అన్నారు. ఉమ్మడి చిల్కానగర్ డివిజన్ పరిధిలోని రాఘవేంద్ర నగర్ కాలనీలో తెలంగాణ మేడేలయ్య రజక సంఘం ఉప్పల్ అధ్యక్షుడు కోలూరి శ్యామ్ ఆధ్వర్యంలో నిర్వహించిన వీరనారి చాకలి చిట్యాల ఐలమ్మ 41వ వర్ధంతి కార్యక్రమానికి బన్నాల గీత ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఐలమ్మ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా బన్నాల గీత మాట్లాడుతూ.. నిజాం పాలన, దొరల పెత్తనం, భూస్వాముల దౌర్జన్యాలు, వెట్టిచాకిరీ, మహిళలపై వివక్ష కొనసాగుతున్న సమయంలో వాటిని ఎదిరిస్తూ చాకలి ఐలమ్మ తిరుగుబాటు పోరాటం సాగించారని తెలిపారు. పేద రజక కుటుంబానికి చెందిన మహిళగా దొరల పెత్తనాన్ని ప్రశ్నిస్తూ, తాను కష్టపడి సాగు చేసిన భూమిపై తన హక్కును నిలబెట్టుకునేందుకు ఆమె పోరాడారని పేర్కొన్నారు. ఆంధ్ర మహాసభ, అనంతరం కమ్యూనిస్టు ఉద్యమం గ్రామీణ ప్రాంతాల్లో రైతులు, కూలీలు, పేదలను వెట్టిచాకిరీ, భూస్వాముల దౌర్జన్యాలకు వ్యతిరేకంగా సంఘటితం చేసిన సమయంలో ఐలమ్మ కూడా ఆ ఉద్యమంతో అనుబంధం ఏర్పరచుకుని తన పోరాటాన్ని విస్తరించారని బన్నాల గీత తెలిపారు. తన ఇంటినే ఉద్యమ కార్యకలాపాలకు కేంద్రంగా మార్చుకుని ప్రజలను చైతన్యపరిచారని చెప్పారు. తన కుటుంబాన్ని వేధింపులకు గురిచేసినా, ఎన్నో ఇబ్బందులు ఎదురైనా ఐలమ్మ వెనక్కి తగ్గలేదని అన్నారు. ఒక కుటుంబం కోసం ప్రారంభమైన ఆమె పోరాటం అనంతరం అనేక పేద కుటుంబాలకు స్ఫూర్తిగా నిలిచిందని, ఒక మహిళ చూపిన ధైర్యం తెలంగాణ ప్రజల్లో ఆత్మవిశ్వాసాన్ని నింపిందని పేర్కొన్నారు. 'బాంచన్ దొర.. నీ కాళ్లు మొక్కుతా' అనే బానిసత్వానికి చాకలి ఐలమ్మ చరమగీతం పాడారు అని బన్నాల గీత అన్నారు. విస్నూర్ దేశ్‌ముఖ్‌లతో పాటు దొరల పెత్తనాన్ని ఎదిరించి పోరాడిన ఐలమ్మ చరిత్ర తెలంగాణ ప్రజల పోరాట స్ఫూర్తికి ప్రతీకగా నిలిచిందన్నారు. ప్రస్తుత సమాజంలోనూ వెనుకబడిన, బలహీన వర్గాలపై జరుగుతున్న అన్యాయాలు, దోపిడీకి వ్యతిరేకంగా ఐక్యంగా పోరాడాల్సిన అవసరం ఉందన్నారు. ఐలమ్మ త్యాగం, పోరాటం తరతరాలకు స్ఫూర్తిదాయకమని తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రజక వృత్తిదారుల సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జ్యోతి, ఉపేందర్, సుభద్ర, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు బన్నాల ప్రవీణ్ ముదిరాజ్, నేర్దం భాస్కర్ గౌడ్, జల్లి మోహన్, కొక్కొండ జగన్ ముదిరాజ్, ఎద్దుల కొండల్ రెడ్డి, రామాంజనేయులు, సత్యరాజ్ గౌడ్, మాస శేఖర్, అల్లిబిల్లి మహేందర్, రవీందర్ గౌడ్, బాలేందర్, ఆటో బాలు యాదవ్, నవీన్ గౌడ్, మేడేలయ్య రజక సంఘం ఉప్పల్ అధ్యక్షుడు కోలూరి శ్యామ్, జనరల్ సెక్రటరీ భామండ్ల రాజు, కనకయ్య, శ్రీను, మల్లేష్, సాయి కిరణ్, రాకేష్, రవికుమార్, మహేందర్, రాజు, సారయ్య, లింగం, సదానందం పాల్గొన్నారు



## పోరాటాల వీరనారి చాకలి ఐలమ్మకు ఘన నివాళి

**వాస్తవ దర్పణం, గుండాల, సెప్టెంబర్ 10 :** యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండలం సీతారాపురం గ్రామంలో రజక సంఘం హెల్పింగ్ సొసైటీ అధ్యక్షుడు సింగారం రమేష్ ఆధ్వర్యంలో చాకలి ఐలమ్మ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రజక సంఘం నాయకులు మాట్లాడుతూ.. దొరల అరాచకాలకు, భూస్వామ్య వ్యవస్థకు వ్యతిరేకంగా చాకలి ఐలమ్మ సాగించిన పోరాటం తెలంగాణ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుందని అన్నారు. అణగారిన వర్గాల హక్కుల కోసం ఆమె చేసిన పోరాటం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కాళీ పద్మ వెంకన్న, ఉపసర్పంచ్ మల్లెపాక నరేష్, పంచాయతీ కార్యదర్శి విజయ, వార్డు సభ్యులు పాచిల్ల శ్రీను, చిలుకూరి మోహన్, మలిపెద్ది సుమతి, మాటూరు శేఖర్, అంగన్‌వాడీ టీచర్ వాణి శ్రీ, ఆశా వర్కర్లు మొగిలిపాక లావణ్య, బొడిగె కవిత, గోపాలమిత్ర పాలడుగు కిష్టయ్య, గ్రామ ప్రజలు బెంజరి శ్రీశైలం, పాలడుగు సోమయ్య, మొగిలిపాక వెంకటేష్, గ్రామపంచాయతీ సిబ్బంది, రజక సంఘం సభ్యులు వెంకటయ్య, రవి, సోమరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## కుటుంబ బాధ్యతలను నిర్వర్తిస్తూనే పీహెచ్‌డీ సాధించిన దీపా బానోత్

- మహిళలకు స్ఫూర్తిగా నిలిచిన విద్యా ప్రస్థానం

**వాస్తవ దర్పణం, ఈసీఐఎల్/నాగారం, సెప్టెంబర్ 10:** కుటుంబ బాధ్యతలను నిర్వర్తిస్తూనే ఉన్నత విద్యను కొనసాగించి డాక్టరేట్ పట్టా సాధించిన డా. దీపా బానోత్ పలువురి అభినందనలు అందుకుంటున్నారు. ఉస్మానియా యూనివర్సిటీ డిపార్ట్‌మెంట్ ఆఫ్ బిజినెస్ మేనేజ్‌మెంట్‌లో పరిశోధక విద్యార్థినిగా కొనసాగిన ఆమె బిజినెస్ మేనేజ్‌మెంట్‌లో పీహెచ్‌డీ పట్టా సాధించారు. ఇద్దరు పిల్లల తల్లిగా, గృహిణిగా కుటుంబ బాధ్యతలను నిర్వర్తిస్తూనే పరిశోధనను విజయవంతంగా పూర్తి చేసి డాక్టరేట్ సాధించడం అభినందనీయమని పలువురు పేర్కొన్నారు. ప్రస్తుతం ఆమె పెద్ద కుమారుడు ఎంబీబీఎస్, చిన్న కుమారుడు ఇంజినీరింగ్ విద్యను అభ్యసిస్తున్నారు. కుటుంబ బాధ్యతల మధ్య సమయాన్ని సమన్వయం చేసుకుంటూ పరిశోధన పూర్తి చేయడం ద్వారా దీపా బానోత్ తన సంకల్పం, పట్టుదల, కృషిని చాటుకున్నారు. "తెలంగాణ రాష్ట్రంలోని ఎంపిక చేసిన ప్రభుత్వ, ప్రైవేటు విశ్వవిద్యాలయాల్లో ఉద్యోగుల సంతృప్తిపై తులనాత్మక అధ్యయనం" అనే అంశంపై ఆమె పరిశోధన చేపట్టారు. ఉన్నత విద్యా సంస్థల్లో ఉద్యోగుల సంతృప్తిని మెరుగుపరిచేందుకు అవసరమైన పలు సూచనలను కూడా తన పరిశోధనలో ప్రతిపాదించారు. ఈ పరిశోధనను డా. వి. సమున్నత పర్యవేక్షణలో విజయవంతంగా పూర్తి చేశారు. డా. దీపా బానోత్ పీహెచ్‌డీ సాధించిన సందర్భంగా ప్రొఫెసర్ శ్రీరాములు, డీన్ ప్రొఫెసర్ జహంగీర్, డిపార్ట్‌మెంట్ హెడ్ ప్రొఫెసర్ విద్యాసాగర్ రావుతో పాటు అధ్యాపకులు, పరిశోధక విద్యార్థులు, సిబ్బంది ఆమెను అభినందించారు. ఈ సందర్భంగా డా. దీపా బానోత్ మాట్లాడుతూ తన విజయానికి సహకరించిన భర్త శ్రీ రవి తేజ, కుటుంబ సభ్యులకు, పరిశోధన పర్యవేక్షకురాలు డా. వి. సమున్నతకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. పరిశోధన సమయంలో వారు అందించిన నిరంతర ప్రోత్సాహం, సహకారం తన పీహెచ్‌డీ ప్రయాణంలో ఎంతో కీలకంగా నిలిచాయని పేర్కొన్నారు. కుటుంబ బాధ్యతలు ఉన్నప్పటికీ ఉన్నత లక్ష్యాలను సాధించవచ్చని దీపా బానోత్ తన విజయంతో నిరూపించారని, ఆమె విద్యా ప్రస్థానం ఉన్నత విద్యను కొనసాగించాలని ఆకాంక్షించే మహిళలకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తుందని పలువురు అభిప్రాయపడ్డారు.





# పేపర్‌బాయ్ నుంచి డాక్టరేట్ వరకు!

- పేదరికాన్ని జయించి ఉస్మానియా నుంచి పీహెచ్‌డీ
- కూలీ పనులు చేస్తూనే ఉన్నత విద్య
- దళిత, బహుజన హక్కుల కోసం ఉద్యమాలు
- రిజర్వేషన్లపై పరిశోధనతో డాక్టరేట్

**వాస్తవ దర్పణం, ఉప్పల్, సెప్టెంబర్ 10:** పేదరికం, కుటుంబ బాధ్యతలు ఎదురైనా చదువును వదలకుండా ముందుకు సాగిన పాల్వాయి నగేష్ ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి పీహెచ్‌డీ పట్టా అందుకున్నారు. ఒకప్పుడు పేపర్‌బాయ్‌గా పనిచేస్తూ, కూలీ పనులు చేస్తూనే ఉన్నత విద్యను కొనసాగించారు. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో చదువుతున్న సమయంలో తెలంగాణ ఉద్యమంలో చురుకుగా పాల్గొన్న నగేష్ దళిత, బహుజన హక్కుల కోసం పలు ఉద్యమాలు చేపట్టారు. లాఠీ దెబ్బలు, కేసులు, దాడులు ఎదురైనా వెనక్కి తగ్గలేదు. 'భారతదేశంలో రిజర్వేషన్ల వ్యవస్థ' అంశంపై పరిశోధన చేసి డాక్టరేట్ సాధించారు. సెప్టెంబర్ 8న జరిగిన ఉస్మానియా స్నాతకోత్సవంలో పీహెచ్‌డీ పట్టా అందుకున్నారు. పేదరికం నుంచి డాక్టరేట్ వరకు ఆయన ప్రస్థానం యువతకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తోంది.





# దివ్యాంగ విద్యార్థులకు అండగా సహాయక పరికరాలు

- 94 మందికి పరికరాల కోసం నమోదు.. భారతి నగర్‌లో అలిమ్కో–విద్యాశాఖ కార్యక్రమం

**వాస్తవ దర్పణం, ఉప్పల్, సెప్టెంబర్ 10 :** దివ్యాంగ విద్యార్థుల విద్యాభివృద్ధి, స్వావలంబనకు తోడ్పాటునందించే దిశగా అలిమ్కో-విద్యాశాఖ సంయుక్త ఆధ్వర్యంలో సహాయక పరికరాల పరిశీలన కార్యక్రమం నిర్వహించారు. ఉప్పల్ భారతి నగర్ ఎంపీపీఎస్ పాఠశాలలో తెలంగాణ సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. జిల్లాలోని భవిత కేంద్రాలు, వివిధ పాఠశాలలు, ప్రాంతాల నుంచి సుమారు 120 మంది దివ్యాంగ విద్యార్థులు హాజరయ్యారు. వారిలో 94 మంది విద్యార్థులకు అవసరమైన సహాయక పరికరాలను గుర్తించేందుకు వైద్య, సాంకేతిక సిబ్బంది పరీక్షలు నిర్వహించి వివరాలను నమోదు చేశారు. కార్యక్రమంలో ఉప్పల్ మండల ఎంఈఓ, జిల్లా ఐఈ కోఆర్డినేటర్, సీఎడీఓ హేమలత, 15 మండలాలకు చెందిన ఐఈఆర్‌పీలు, సాంకేతిక సిబ్బంది, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు. అవసరాన్ని బట్టి విద్యార్థులకు పరికరాలు అందించడం ద్వారా వారు విద్యలో మరింత ముందుకు సాగేందుకు అవకాశం కలుగుతుందని అధికారులు తెలిపారు. తల్లిదండ్రులు ప్రభుత్వం కల్పిస్తున్న ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

# అర్ధరాత్రి కలకలం.. మహిళ చెవి నుంచి రక్తస్రావం!

- మల్లికార్జున్‌నగర్‌లో ఘటన.. యజమాని వెంటనే ఆస్పత్రికి తరలింపు
- శ్రీకర ఆస్పత్రిలో చికిత్స.. ఘటనపై వివరాలు సేకరిస్తున్న నాచారం పోలీసులు



**వాస్తవ దర్పణం,ఉప్పల్, సెప్టెంబర్ 10:** నాచారం పోలీస్‌స్టేషన్ పరిధిలోని మల్లికార్జున్‌నగర్ రోడ్ నంబర్-4లో అర్ధరాత్రి ఓ మహిళ గాయపడిన ఘటన కలకలం రేపింది. కాంచని కుమార్ (30) కుటుంబంతో కలిసి పెంట్‌హౌస్‌లో నివసిస్తోంది. ఆమె భర్త వినోద్‌కుమార్ మల్లాపూర్ ఎఫ్‌సీఐ గోదాముల వద్ద రాయల్ కార్ కేర్ సర్వీస్‌లో పని చేస్తున్నట్లు సమాచారం. అదే గదిలో సూరజ్ అనే వ్యక్తి కూడా ఉన్నట్లు తెలిసింది. సెప్టెంబర్ 9న రాత్రి 12:15 గంటల సమయంలో కాంచని కింద ఉన్న రెండో అంతస్తు ఇంటి యజమాని మహేష్ వద్దకు వచ్చి తలుపు తీయాలని కోరింది. తలుపు తెరిచి చూడగా ఆమె ఎడమ చెవి నుంచి రక్తస్రావం అవుతున్నట్లు గుర్తించారు. వెంటనే మహేష్ ఆమెను మల్లాపూర్‌లోని ఆశ్రిత ఆస్పత్రికి తరలించారు. అక్కడి వైద్యుల సూచన మేరకు మెరుగైన చికిత్స కోసం ఈసీఐఎల్‌లోని శ్రీకర ఆస్పత్రికి తరలించి చేర్పించారు. మహిళకు గాయాలు ఎలా అయ్యాయి? ఘటనకు ముందు ఏం జరిగింది? అనే విషయాలపై నాచారం పోలీసులు వివరాలు సేకరిస్తున్నట్లు సమాచారం.



## రూ.30 కోట్లతో హెచ్‌ఎంటీ నగర్

# పెద్ద చెరువు అభివృద్ధి

- చెరువు అభివృద్ధి పనులను పరిశీలించిన హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్

**వాస్తవ దర్పణం, నాచారం, సెప్టెంబర్ 10:** హెచ్‌ఎంటీ నగర్ పెద్ద చెరువును రూ.30 కోట్లతో పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసి సుందరీకరించనున్నట్లు హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ తెలిపారు. గురువారం ఉమ్మడి నాచారం డివిజన్ కాంగ్రెస్ నాయకులతో కలిసి ఆయన హెచ్‌ఎంటీ పెద్ద చెరువును సందర్శించి, అభివృద్ధి, సుందరీకరణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ రంగనాథ్ మాట్లాడుతూ.. చెరువు అభివృద్ధి, సుందరీకరణ పనులను నిర్ణీత సమయంలో పూర్తి చేసేలా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. చెరువు పరిసరాలను ప్రజలకు ఆహ్లాదకరంగా, ఉపయోగకరంగా తీర్చిదిద్దేలా ప్రణాళికాబద్ధంగా పనులు చేపట్టాలని సూచించారు. అనంతరం హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్‌ను నాచారం కాంగ్రెస్ నాయకులు ఘనంగా సన్మానించారు. ఉప్పల్ నియోజకవర్గంలోని చెరువుల అభివృద్ధికి రూ.150 కోట్ల నిధులు కేటాయిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి, నియోజకవర్గ అభివృద్ధికి సహకరిస్తున్న కాంగ్రెస్ ఉప్పల్ నియోజకవర్గ ఇన్‌చార్జి మందుముల పరమేశ్వర్‌రెడ్డికి నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు మహేష్ యాదవ్, కృష్ణారెడ్డి, రామ్‌రెడ్డి, అశ్వత్థామరెడ్డి, హెచ్‌ఆర్ మోహన్, రమేష్ గౌడ్, మెతుకు శ్రీనివాస్‌రెడ్డి, నరేష్, అశోక్, కృష్ణ యాదవ్, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.



# కాళోజీ జీవితం–సాహిత్యంపై విద్యార్థి సదస్సులు

- ఆత్మగౌరవం, ప్రజాస్వామ్య విలువలకు కాళోజీ ప్రతీక

**వాస్తవ దర్పణం, ఉప్పల్, సెప్టెంబర్ 10:** ప్రజాకవి కాళోజీ నారాయణరావు ఆత్మగౌరవానికి, ప్రజాస్వామ్య విలువలకు ప్రతీకగా నిలిచారని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఉప్పల్ ఐక్యూఏసీ సమన్వయకర్త డా. ఏసీహెచ్ సత్యనారాయణ అన్నారు. కాళోజీ జయంతిని పురస్కరించుకుని కళాశాల తెలుగు విభాగం ఆధ్వర్యంలో తెలంగాణ భాషా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు కాళోజీ జీవితం, సాహిత్యంపై సదస్సులు నిర్వహించారు. ఆయన ప్రజా ఉద్యమాల్లో పాల్గొని ప్రజల పక్షాన నిలిచారని తెలుగు సహాయాచార్యులు జల్దా విశ్వనాథ్ కుమార్ తెలిపారు. ప్రిన్సిపాల్ డా. కె. విజయ్ కుమార్ మాట్లాడుతూ తెలంగాణ భాష, సంస్కృతి, రాష్ట్ర సాధన కోసం కాళోజీ చేసిన కృషి చిరస్మరణీయమన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.




# తెలంగాణ ఉద్యమంలో విద్యార్థుల పాత్రపై పరిశోధనకు డాక్టరేట్

- ఓయూ 85వ స్నాతకోత్సవంలో తాళ్ల అజయ్‌కు పట్టా ప్రదానం
- తల్లిదండ్రులు, ఉద్యమకారులకు డాక్టరేట్ అంకితం

**వాస్తవ దర్పణం, ఉప్పల్,సెప్టెంబర్ 10:** తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో విద్యార్థుల పాత్రపై చేసిన పరిశోధనకు చెన్నారావుపేట (రాజీవ్‌నగర్ కాలనీ)కి చెందిన తాళ్ల అజయ్ డాక్టరేట్ పట్టా అందుకున్నారు. ఉస్మానియా యూనివర్సిటీ 85వ స్నాతకోత్సవంలో భాగంగా ఠాగూర్ ఆడిటోరియంలో జరిగిన కార్యక్రమంలో ఆయనకు పట్టా ప్రదానం చేశారు. 'రోల్ ఆఫ్ స్టూడెంట్స్ ఇన్ తెలంగాణ మూవ్‌మెంట్ (1956-2014)' అంశంపై అజయ్ చేసిన పరిశోధనకు ఈ డాక్టరేట్ లభించింది. తెలంగాణ గవర్నర్, ఓయూ ఛాన్సలర్ శివ ప్రతాప్ శుక్లా అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి భారత్ బయోటెక్ వ్యవస్థాపకుడు, చైర్మన్ డా. కృష్ణ ఎల్లా ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఓయూ వైస్‌చాన్స్‌లర్ ప్రొ. కుమార్ మొలుగరం సమక్షంలో అజయ్ డాక్టరేట్ పట్టా స్వీకరించారు. ఈ సందర్భంగా అజయ్ మాట్లాడుతూ తన విద్యా ప్రయాణంలో అండగా నిలిచిన గురువులు, బంధుమిత్రులకు కృతజ్ఞతలు తెలిపారు. డాక్టరేట్ సాధించడం తన సామాజిక బాధ్యతను మరింత పెంచిందన్నారు. తనను ఈ స్థాయికి తీసుకొచ్చిన తల్లిదండ్రులకు, తెలంగాణ సాధన కోసం త్యాగాలు చేసిన విద్యార్థులు, ఉద్యమకారులకు ఈ డాక్టరేట్‌ను అంకితం చేస్తున్నట్లు పేర్కొన్నారు.

# రైతు, కార్మికులు, రైస్ మిల్లులకు తీవ్ర ఆటంకాలు కల్పిస్తున్న వైఖరి పై సమర శంఖం

- జిల్లా వ్యాప్తంగా రైస్ మిల్లులు సంపూర్ణ బంద్
- రోడ్డు మీద పడ్డ రైస్ మిల్లుల పై ఆధారపడిన కుటుంబాలు
- రైస్ మిల్ యజమానులు కలెక్టరేట్ వద్ద నిరసన మహా ధర్నా




**వాస్తవ దర్పణం, యాదాద్రి ప్రతినిధి, సెప్టెంబర్ 10 :** తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా రైస్ మిల్లులు తీవ్ర సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్నాయి. ప్రభుత్వ వేధింపులు, గిడ్డంగుల కొరత, గిట్టుబాటు కాని సీఎంఆర్ ధరలకు నిరసనగా రాష్ట్రవ్యాప్తంగా రైస్ మిల్లుల బందు పిలుపు ఇవ్వడంతో రైస్ మిల్లుల పై ఆధారిత కుటుంబాలు వీధిన పడ్డాయి. రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు గురువారం యాదాద్రి భువనగిరి జిల్లా రైస్ మిల్లులు జిల్లా అధ్యక్షుడు మార్త వెంకటేష్ ఆధ్వర్యంలో చలో కలెక్టరేట్ పిలుపునిచ్చారు. యజమాన్యాలు జిల్లాలోని రైస్ మిల్లులను సంపూర్ణంగా బంద్ ను పాటించి జిల్లా కలెక్టరేట్ కార్యాలయం వద్ద నిరసన మహాధర్నా నిర్వహించారు. రైస్ మిల్లుల సమస్యలు పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు మార్త వెంకటేశం మాట్లాడుతూ యాదాద్రి భువనగిరి జిల్లాలో రైస్ మిల్ పరిశ్రమలు సంక్షోభంలో ఉన్నాయని రైస్ మిల్లుల సమస్యలను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని కార్మికులకు రైతులకు యాజమాన్యాలకు తీవ్ర ఆటంకాలు కల్పిస్తున్న ఉన్న వైఖరిని మానుకోవాలని అన్నారు. ఎఫ్‌సీఐ గోదాములలో నిలువ స్థలాలు కొరత, విధాన నిర్ణయాల్లో ఆలస్యం కారణంగా ఏర్పడే డిఫాల్ట్ నివారించాలని కోరారు. గత పది సంవత్సరాల లో డిఫాల్ట్ అయిన సరుకు లో రెండు శాతం కంటే తక్కువ ఉన్నప్పటికీ, సహేతుకమైన వాటా కారణంగా మొత్తం రైస్ మిల్లుల పరిశ్రమనే బాధ్యులుగా చూపడం సముచిత కాదని అన్నారు. అవుట్ టర్న్ రేషియో ఓటీఆర్ నిర్ధారించేందుకు సి ఎఫ్ టి ఆర్ ఐ మైసూర్ లో నిర్వహించిన మిల్లింగ్ పరీక్షల నివేదికలు విడుదల చేసి రాబోయే పంట సీజన్ ఆధారంగా ఓటీఆర్ అమలు చేయాలని కోరారు. అధిక బ్రోకెన్, సార్టెక్స్ నష్టం, ప్రతికూల వర్షాల నష్టం, మైచరైస్ నష్టం, దీర్ఘకాలం నిల్వా లో నాణ్యత క్షీణించడం, నష్టాలను పరిగణలోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. గత పది సంవత్సరాలకు సంబంధించిన అన్ని సీఎంఆర్ డెలివరీ పూర్తయ్య వరకు మిల్లులకు కొత్త ధాన్యాన్ని కేటాయించకూడదని కోరారు. ఉపాధి అవకాశాలు కల్పిస్తున్న రాష్ట్ర ఆర్థిక సామాజిక అభివృద్ధికి తమ పరిశ్రమలు తమ వంతు సహకారం అందిస్తుందని అన్నారు. రైస్ పరిశ్రమ సమస్యలకు శాశ్వత పరిష్కారం రాష్ట్ర ప్రభుత్వం ఈ అంశాలపై సమగ్రంగా చర్చించి తగిన నిర్ణయం తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు పసుపు నూరి నాగభూషణం, జిల్లా కోశాధికారి అశోక్, పెద్ది మురళి, పసుపు నూరి మనోహర్, జెల్లా రమణ, జిల్లా రైస్ మిల్లుల యజమానులు, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

# ఛార్మినార్ నియోజకవర్గం బీఆర్ఎస్ ఇంచార్జ్ ఎండీ సలావుద్దీన్ హౌస్ అరెస్ట్



**వాస్తవ దర్పణం, చార్మినార్ హైదరాబాద్ సిటీ బ్యూరో, సెప్టెంబర్ 10:** ఛార్మినార్ నియోజకవర్గ బీఆర్ఎస్ ఇంచార్జ్, యువనేత ఎండీ సలావుద్దీన్ ను మీర్ చౌక్ పోలీసులు ఈరోజు తెల్లవారుజామున 4 గంటల సమయంలో ఆయన నివాసంలో హౌస్ అరెస్ట్ చేశారు ఎలాంటి ముందస్తు నోటీసు లేదా కారణం చెప్పకుండా పోలీసులు ఇంట్లోకి ప్రవేశించి హౌస్ అరెస్ట్ చేసినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ రోజు నగరంలో జరగబోయే నిరసన కార్యక్రమం లేదా పర్యటన నేపథ్యంలో ముందస్తు చర్యగా పోలీసులు ఈ చర్య తీసుకున్నట్లు సమాచారం. సలావుద్దీన్ అరెస్ట్ విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున ఆయన నివాసానికి చేరుకుంటున్నారు. పాతబస్తీలో పోలీసులు ముందస్తుగా భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ అక్రమ హౌస్ అరెస్ట్ ను బీఆర్ఎస్ శ్రేణులు తీవ్రంగా ఖండించాయి. ప్రశ్నించే గొంతుకలను అణిచివేయడానికి కాంగ్రెస్ ప్రభుత్వం పోలీసు వ్యవస్థను అడ్డుపెట్టుకుని అక్రమ కేసులు, అరెస్టులకు పాల్పడుతోందని మండిపడ్డారు. ప్రజా సమస్యలపై పోరాడుతున్న నాయకుడిని అరెస్ట్ చేయడం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడమేనని బీఆర్ఎస్ నాయకులు ఆరోపించారు. సలావుద్దీన్ ను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

# ప్రభుత్వ భూముల చెరువుల కబ్జాకు కాంగ్రెస్–బీఆర్ఎస్ హయాంలోనే బీజం

- మేడ్చల్ నియోజకవర్గం పీర్జాదిగూడ మరియు మేడిపల్లి డివిజన్ల లో చెరువు భూముల పరిరక్షణకు బీజేపీ పోరాటం – హైడ్రా కమిషనర్ రంగనాథ్ పరిశీలన



**వాస్తవదర్పణం, మేడిపల్లి:** మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని పీర్జాదిగూడ10 డివిజన్‌లో మేడిపల్లి ప్రభుత్వ భూములు, చెరువు బఫర్‌జోన్ పరిరక్షణపై బీజేపీ నాయకులు చేపట్టిన పోరాటానికి స్పందన లభించింది. సర్వే నంబర్ 28లో ఉన్న సుమారు 15 ఎకరాల 28 గుంటల ప్రభుత్వ స్థలంలో చెరువును ఆనుకుని ఉన్న బఫర్‌జోన్ భూములపై అక్రమ నిర్మాణాలు, ఆక్రమణలు జరుగుతున్నాయంటూ బీజేపీ నాయకులు పలుమార్లు హైడ్రా కమిషనర్ రంగనాథ్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో హైడ్రా అధికారులు గురువారం మేడిపల్లి ప్రాంతాన్ని సందర్శించి పరిస్థితిని పరిశీలించారు. ఈ సందర్భంగా బీజేపీ మేడిపల్లి డివిజన్ అధ్యక్షులు జమ్ముల ప్రభాకర్ రెడ్డి గారు, BJYM రాష్ట్ర నాయకులు బండారు పవన్ రెడ్డి గారు ,బీజేపీ జిల్లా కార్యదర్శి జైపాల్ రెడ్డి గారు, గారు లు ప్రభుత్వ భూముల పరిస్థితిని అధికారులకు వివరించారు. బీజేపీ నాయకుల ఆరోపణల ప్రకారం.. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే సర్వే నంబర్ 28 పరిధిలోని ప్రభుత్వ భూముల్లో సుమారు ఏడు ఎకరాల మేర భూమి మాయమైనట్లు, చెరువులో మట్టి పోసి కొందరు వ్యక్తులు కమర్షియల్ పార్కింగ్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అనంతరం ప్రభుత్వాలు మారినా ప్రభుత్వ భూముల పరిరక్షణపై నిర్లక్ష్యం కొనసాగిందని వారు ఆరోపించారు. అదేవిధంగా సర్వే నంబర్ 29లో కొంత మంది కన్స్ట్రక్షన్ పేరుతో నిర్మాణ పనులు ప్రారంభించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని, ప్రభుత్వ భూములు, చెరువు బఫర్‌జోన్‌లను కాపాడాల్సిన అధికారులు గతంలో పట్టించుకోకపోవడం వల్లే ఆక్రమణదారులకు ధైర్యం వచ్చిందని బీజేపీ నాయకులు విమర్శించారు. "ప్రభుత్వ భూములను కాపాడాల్సిన ప్రభుత్వాలే ఆక్రమణలకు పరోక్షంగా అవకాశం కల్పిస్తే ప్రజా ఆస్తులు ఎక్కడ మిగులుతాయి?" అని బీజేపీ నాయకులు ప్రశ్నించారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ ప్రభుత్వాల పాలనలో ప్రభుత్వ భూములు, చెరువుల పరిరక్షణ విషయంలో జరిగిన నిర్లక్ష్యంపై సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. చెరువు బఫర్‌జోన్, ప్రభుత్వ భూముల్లో జరిగిన ఆక్రమణలు, మట్టి పూడ్చివేతలు, నిర్మాణాలపై పూర్తిస్థాయి విచారణ చేపట్టి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని హైడ్రా అధికారులను కోరారు. ప్రభుత్వ భూమిని ఒక్క గజం కూడా ఆక్రమించకుండా కాపాడే వరకు బీజేపీ తరఫున పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. మేడిపల్లిలో హైడ్రా కమిషనర్ రంగనాథ్ పర్యటనతో ప్రభుత్వ భూముల ఆక్రమణలపై చర్యలు తీసుకుంటారనే ఆశాభావం స్థానికుల్లో వ్యక్తమవుతోంది.



# వీరనారి చాకలి ఐలమ్మకు ఘన నివాళి

- బీరప్పగడ్డ డివిజన్‌లో వర్ధంతి కార్యక్రమం.. పోరాట స్ఫూర్తి నేటి తరానికి ఆదర్శం

**వాస్తవ దర్పణం, ఉప్పల్, సెప్టెంబర్ 10:** వీరనారి చాకలి ఐలమ్మ వర్ధంతిని పురస్కరించుకుని బీరప్పగడ్డ డివిజన్‌లో డివిజన్ ప్రెసిడెంట్ ఆకిటి ఆగం రెడ్డి ఆధ్వర్యంలో నివాళి కార్యక్రమం నిర్వహించారు. ఐలమ్మ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా ఆగం రెడ్డి మాట్లాడుతూ భూస్వాములు, రజాకార్ల దౌర్జన్యాలకు వ్యతిరేకంగా ఐలమ్మ సాగించిన పోరాటం స్ఫూర్తిదాయకమన్నారు. పేదలు, బడుగు బలహీన వర్గాల హక్కుల కోసం ఆమె చేసిన పోరాటం చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుందని పేర్కొన్నారు.కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు జగదీష్, ఫహీమ్, సోను గౌడ్, టైలర్ శ్రీను, మధు, వంశీ, కాశీ, బబ్లూ, మహేష్, సంతోష్, బాబు పాల్గొన్నారు.


వాస్తవ దర్పణం
తెలుగు దిన పత్రిక




## ట్రంప్ సర్కారు వివాదాస్పద పోస్టర్

- 'మిస్టర్ సింగ్' అంటూ వ్యాఖ్యలు
- సిక్కు, హిందూ, పంజాబీ అమెరికన్ సంఘాల ఆగ్రహం

అమెరికాలో వలసదారులపై ట్రంప్ ప్రభుత్వం చేపడుతున్న చర్యలు మరోసారి వివాదానికి దారితీశాయి. హోంల్యాండ్ సెక్యూరిటీ విభాగం (డీహెచ్ఎస్) ఎక్స్‌లో షేర్ చేసిన ఓ పోస్టర్‌పై సిక్కు, హిందూ, పంజాబీ అమెరికన్ సంఘాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశాయి. 'ట్రాన్స్‌ఫార్మర్స్' తరహాలో రూపొందించిన పోస్టర్‌లో తలపాగా, గడ్డంతో ఉన్న వ్యక్తిని చూపిస్తూ.. 'మిస్టర్ సింగ్, అమెరికా రోడ్ల నుంచి వెళ్లిపోండి. మీకు డ్రైవింగ్ చేయడం రాదు' అనే సందేశాన్ని ఉంచారు. అక్రమ వలసదారులు స్వచ్ఛందంగా దేశం విడిచి వెళ్లాలన్న ప్రచారంలో భాగంగానే దీన్ని రూపొందించినట్లు తెలుస్తోంది. అయితే 'సింగ్' అనే ఇంటిపేరు ముఖ్యంగా సిక్కులు, పంజాబీల్లో విస్తృతంగా ఉండటంతో పోస్టర్ జాతి వివక్షను ప్రోత్సహించేలా ఉందని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పోస్టర్‌పై దర్యాప్తు చేయాలని హిందూ, సిక్కు సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

## విజయ్ పార్టీకి ఈసీ గుర్తింపు

- టీవీకేకు 'విజిల్' గుర్తు కేటాయింపు
- తమిళనాడు, పుదుచ్చేరిలో రిజిస్టర్డ్ పార్టీగా గుర్తింపు

**వాస్తవదర్పణం, నేషనల్ డెస్క్:** నటుడు నుంచి రాజకీయ నాయకుడిగా మారిన తమిళనాడు సీఎం జోసెఫ్ విజయ్ నేతృత్వంలోని తమిళగ వెట్రి కళగం (టీవీకే)కు ఎన్నికల సంఘం కీలక గుర్తింపు ఇచ్చింది. తమిళనాడు, పుదుచ్చేరి కేంద్ర పాలిత ప్రాంతాల్లో టీవీకేను రిజిస్టర్డ్ రాజకీయ పార్టీగా గుర్తిస్తూ 'విజిల్' ఎన్నికల గుర్తును కేటాయించింది. ఈ పరిణామంపై విజయ్ హర్షం వ్యక్తం చేస్తూ పార్టీకి అండగా నిలిచిన ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. టీవీకే రాజకీయ ప్రస్థానంలో ఇదొక కీలక మైలురాయిగా అభివర్ణించారు. టీవీకేకు ప్రజల నుంచి లభించిన ఆదరణను విజయ్ ప్రస్తావించారు. నిజాయితీ, అవినీతి రహిత పాలన అందించడంతో పాటు పారదర్శకత, జవాబుదారీతనానికి ప్రాధాన్యం ఇస్తామని తెలిపారు. సామాజిక న్యాయం, సమానత్వం, ప్రజా సంక్షేమమే తమ రాజకీయ సిద్ధాంతాలకు ఆధారమని స్పష్టం చేశారు. ప్రజల నమ్మకాన్ని నిరంతర ప్రజాసేవ ద్వారా నిలబెట్టుకుంటానని పేర్కొన్నారు.

**విజయ్ నాయకత్వంలో కొత్త కూటమి**

టీవీకే నేతృత్వంలో కొత్త కూటమి కూడా ఏర్పడింది. దీనికి 'సెక్యులర్ సోషల్ జస్టిస్ విక్టరీ అలయన్స్'గా పేరు పెట్టారు. చెన్నైలోని పనైయూర్‌లో టీవీకే కార్యాలయంలో బుధవారం జరిగిన కూటమి సమన్వయ సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. లౌకికవాదం, సామాజిక న్యాయం, తమిళనాడు హక్కుల పరిరక్షణ లక్ష్యాలతో కూటమి పనిచేస్తుందని తమిళనాడు కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు మాణికం ఠాగూర్ తెలిపారు. టీవీకేతో పాటు కాంగ్రెస్, వీసీకే, ఎండీఎంకే, ఐయూఎంఎల్ ఇందులో భాగస్వాములుగా ఉన్నాయి.



## డిజిటల్ వేదికల్లో పిల్లల భద్రతకు పటిష్ఠ రక్షణ

- పిల్లల భద్రతకు మరింత పటిష్ఠ వ్యవస్థ అవసరం: సుప్రీంకోర్టు
- 18 ఏళ్లలోపు వారితో డిజిటల్ సంస్థల ఒప్పందాలపై నియంత్రణలు అవసరం
- వయసు నిర్ధారణ, వ్యక్తిగత సమాచార రక్షణకు స్పష్టమైన నిబంధనలు ఉండాలి

**వాస్తవదర్పణం, నేషనల్ డెస్క్:** సోషల్ మీడియా, ఇతర డిజిటల్ వేదికలను వినియోగించే పిల్లల భద్రతకు మరింత పటిష్ఠమైన రక్షణ వ్యవస్థ అవసరమని సుప్రీంకోర్టు అభిప్రాయపడింది. 18 ఏళ్లలోపు పిల్లలతో డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లు నేరుగా ఒప్పందాలు చేసుకోకుండా నియంత్రణలు విధించాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌పై విచారణకు అంగీకరించింది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, న్యాయమూర్తులు జస్టిస్ జోయ్‌మాల్య బాగ్చీ, జస్టిస్ వీ. మోహన్‌లతో కూడిన ధర్మాసనం కేంద్రానికి, ఇతర సంబంధిత వర్గాలకు నోటీసులు జారీ చేసింది. 'జస్ట్ రైట్స్ ఫర్ చిల్డ్రన్ అలయన్స్' దాఖలు చేసిన పిటిషన్‌లో డిజిటల్ వేదికల వయసు నిబంధనలు, భారత చట్టాల మధ్య వ్యత్యాసాన్ని ప్రస్తావించారు. కొన్ని వేదికలు 13 ఏళ్ల నుంచే ఖాతాలు తెరిచేందుకు అవకాశం కల్పిస్తున్నాయని, భారత చట్టాల ప్రకారం 18 ఏళ్లలోపు వారంతా మైనర్లేనని పేర్కొన్నారు. పిల్లల వయసు నిర్ధారణ, వ్యక్తిగత సమాచార రక్షణ, ప్రమాదకర కంటెంట్ నుంచి కాపాడేందుకు స్పష్టమైన నిబంధనలు అవసరమని కోరారు. చైల్డ్ సెక్సువల్ ఎక్స్‌ప్లాయిటేటివ్ అండ్ అబ్యూజ్ మెటీరియల్‌ను అరికట్టేందుకు ఆటోమేటెడ్ కంటెంట్ ఫిల్టరింగ్ వ్యవస్థలను విస్తృతంగా వినియోగించాలని పిటిషన్‌లో విజ్ఞప్తి చేశారు. మైనర్లు డిజిటల్ సేవలను వినియోగించాలంటే తల్లిదండ్రులు లేదా చట్టబద్ధ సంరక్షకుల అనుమతి తప్పనిసరి చేయాలని, వారి గుర్తింపును ఈకేవైసీ ద్వారా నిర్ధారించే విధానం ఉండాలని కోరారు.

# అంతరిక్షం.. అందరి బాధ్యత

- సురక్షిత, భద్రమైన, సుస్థిర అంతరిక్ష వ్యవస్థకు భారత్ మద్దతు
- అంతర్జాతీయ చట్టాలకు అనుగుణంగా కార్యకలాపాలు సాగాలి
- 2035 నాటికి భారతీయ అంతరిక్ష కేంద్రం
- 2040లో చంద్రుడిపైకి భారతీయుడు
- ప్రధానమంత్రి నరేంద్ర మోడీ స్పష్టం



**వాస్తవదర్పణం, నేషనల్ డెస్క్:** సురక్షితమైన, భద్రమైన, సుస్థిరమైన అంతరిక్ష వ్యవస్థకు భారత్ మద్దతు ఇస్తుందని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ స్పష్టం చేశారు. అంతర్జాతీయ చట్టాలకు అనుగుణంగా అంతరిక్ష కార్యకలాపాలు కొనసాగాలని పేర్కొన్నారు. పారిస్‌లో జరుగుతున్న అంతర్జాతీయ స్పేస్ సమ్మిట్‌ను గురువారం వర్చువల్‌గా ఉద్దేశించి ఆయన ప్రసంగించారు. అంతరిక్షం అందించే అవకాశాలకు హద్దులు లేవని, అయితే దాని వినియోగంపై అందరి బాధ్యత ఉమ్మడిదేనని అన్నారు. భారత్ అంతరిక్ష విధానం 'వసుధైవ కుటుంబకం' స్ఫూర్తితో సాగుతోందని మోడీ తెలిపారు. అంతరిక్షంలో లభించే శాస్త్రీయ సమాచారాన్ని పారదర్శకత, సమగ్రతతో మానవాళి ఉమ్మడి ప్రయోజనాలకు వినియోగించాలని సూచించారు. భారత్ తదుపరి తరం అంతరిక్ష పరిశోధన, అభివృద్ధి కార్యక్రమాల్లో ఫ్రాన్స్‌తో పాటు ఇతర దేశాలు భాగస్వాములు కావాలని ఆహ్వానించారు.

**రైతులు, మత్స్యకారులకు ఇస్రో సేవలు**

భారత అంతరిక్ష ప్రయాణానికి ఇస్రో కేంద్రబిందువుగా ఉందని మోడీ తెలిపారు. తక్కువ వ్యయంతో అత్యుత్తమ సాంకేతిక సామర్థ్యంతో మిషన్లు నిర్వహిస్తూ ప్రపంచ ప్రశంసలు అందుకుంటోందన్నారు. ఇస్రో సాంకేతికతలు రైతులకు వ్యవసాయ సమాచారం, మత్స్యకారులకు సముద్ర సమాచారం అందించడంతో పాటు వాతావరణ అంచనాలు, విపత్తు నిర్వహణ, నావిగేషన్ వంటి రంగాల్లో ఉపయోగపడుతున్నాయని వివరించారు. భారత రాకెట్ల ద్వారా ఇప్పటివరకు 34 దేశాలకు చెందిన 430కుపైగా ఉపగ్రహాలను అంతరిక్షంలోకి పంపినట్లు తెలిపారు.

**2035లో భారతీయ అంతరిక్ష కేంద్రం**

2035 నాటికి భారతీయ అంతరిక్ష కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని మోడీ వెల్లడించారు. 2040 నాటికి భారతీయుడిని చంద్రుడిపైకి పంపేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు తెలిపారు. చంద్రయాన్3తో చంద్రుడి దక్షిణ ధ్రువానికి సమీప ప్రాంతంలో సాఫ్ట్ ల్యాండింగ్ చేసిన తొలి దేశంగా భారత్ నిలిచిందని గుర్తుచేశారు. ఆదిత్యఎల్ 1 సూర్యుడిపై కీలక సమాచారాన్ని అందిస్తోందన్నారు.

**ప్రైవేట్ రంగానికీ ప్రోత్సాహం**

దేశంలోని ప్రైవేట్ అంతరిక్ష రంగం కూడా వేగంగా అభివృద్ధి చెందుతోందని మోడీ చెప్పారు. ప్రైవేట్ సంస్థల ఉత్సాహం, ఇస్రో సాంకేతిక నైపుణ్యం కలవడంతో కొత్త శక్తి ఏర్పడుతోందన్నారు. 1960ల నుంచే ఫ్రాన్స్ భారత్‌కు విశ్వసనీయ అంతరిక్ష భాగస్వామిగా ఉందని పేర్కొన్నారు. ఇరు దేశాల సహకారం విస్తరించిందని తెలిపారు.

# ఏడేళ్ల తర్వాత భారత్‌కు జిన్‌పింగ్

- బ్రిక్స్ సమావేశానికి చైనా అధ్యక్షుడు
- ప్రధాని ఆహ్వానం మేరకు భారత్‌కు రానున్నట్లు వెల్లడి
- సెప్టెంబర్ 12,13 తేదీల్లో జరగనున్న బ్రిక్స్ సమావేశం
- రెండు దేశాధినేతలు సమావేశమయ్యే అవకాశం

**వాస్తవదర్పణం, నేషనల్ డెస్క్:**



దేశ రాజధాని ఢిల్లీలో సెప్టెంబర్ 12,13 తేదీల్లో జరిగే బ్రిక్స్ సమావేశానికి చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ హాజరుకానున్నట్లు చైనా విదేశాంగ మంత్రిత్వ శాఖ గురువారం ధ్రువీకరించింది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆహ్వానం మేరకు ఆయన భారత పర్యటనకు రానున్నట్లు పేర్కొంది. దీంతో గత కొద్దిరోజులుగా జిన్‌పింగ్ భారత్ పర్యటన విషయంలో కొనసాగుతోన్న సస్పెన్స్‌కు తెరపడింది. దాదాపు ఏడేళ్ల తర్వాత జిన్‌పింగ్ భారత్‌లో పర్యటించడం ఇదే మొదటిసారి. ఈ పర్యటనలో, సదస్సు కార్యక్రమాలతో పాటుగా మోదీతో, జిన్‌పింగ్ సమావేశమయ్యే అవకాశం ఉందని, సరిహద్దు వివాదాల గురించి కీలక చర్చలు జరిపే అవకాశం ఉందని వర్గాలు పేర్కొన్నాయి. పశ్చిమాసియా సంఘర్షణలు, రష్యాఉక్రెయిన్ యుద్ధం నేపథ్యంలో జిన్‌పింగ్ ఈ పర్యటన అత్యంత ప్రాధాన్యాన్ని సంతరించుకుంది.

**గల్వాన్ లోయ ఘర్షణతో**

జిన్‌పింగ్ చివరిసారిగా 2019లో చెన్నై సమీపంలోని మామల్లపురంలో మోదీతో అనధికారిక సదస్సు కోసం భారత్‌ను సందర్శించారు. అంతకుముందు 2016లో బ్రిక్స్ సదస్సుకు హాజరయ్యేందుకు జిన్‌పింగ్ గోవాను సందర్శించారు. అలాగే 2014 సెప్టెంబర్‌లో పర్యటించినప్పుడు ప్రధాని మోదీతో విస్తృత చర్చలు జరిపారు. అయితే, 2020 తూర్పు లద్దాఖ్ సరిహద్దు ఉద్రిక్తతల తర్వాత రెండు దేశాల మధ్య సంబంధాలు క్షీణించాయి. రెండు దేశాల మధ్య ఉన్న సరిహద్దు సమస్య అలాగే, సరిహద్దు వెంబడి శాంతిని కాపాడటం, ద్వైపాక్షిక సంబంధాలను మెరుగుపరిచడం వంటి చర్యలపై జాతీయ భద్రతా సలహాదారు అజిత్ ధోబాల్, చైనా విదేశాంగ మంత్రి వాంగ్ యీ గత నెలలో బీజింగ్‌లో విస్తృత చర్చలు జరిపారు. ఆగస్టు 25న బీజింగ్‌లో జరిగిన 25వ విడత ప్రత్యేక ప్రతినిధుల చర్చల సందర్భంగా సరిహద్దుల వివాదం గురించి ఇరువురు నేతలు ఒక అభిప్రాయానికి వచ్చారు. సరిహద్దు నిర్వహణలో 'త్వరిత గణనీయమైన ఫలితాల' కోసం ఇరుపక్షాలు ఎనిమిది అంశాలపై ఏకాభిప్రాయానికి వచ్చాయి.

**'కూటమి అజెండాలో బహుపాక్షిక సహకారమే ప్రధానాంశంగా'**

ఇదిలా ఉండగా, ఢిల్లీలో జరిగే ఈ బ్రిక్స్ సదస్సు ప్రపంచంలోని ప్రధాన వర్ధమాన ఆర్థిక వ్యవస్థలైన బ్రెజిల్, రష్యా, భారత్, చైనా, దక్షిణాఫ్రికాలను ఒకచోట చేర్చనుంది. ఈ కూటమి అజెండాలో బహుపాక్షిక సహకారం ప్రధానాంశంగా కొనసాగుతుందని వర్గాలు భావిస్తున్నాయి. ఈ చర్చలు బ్రిక్స్ దేశాల మధ్య వాణిజ్యాన్ని విస్తరించడం, చెల్లింపుల వ్యవస్థలను బలోపేతం చేయడం, శాస్త్ర సాంకేతిక రంగాల్లో సహకారాన్ని పెంపొందించడం, వాతావరణ మార్పులను ఎదుర్కోవడం, ప్రధాన అంతర్జాతీయ సమస్యలపై వైఖరులను సమన్వయం చేసుకోవడం వంటి అనేక ఉమ్మడి ప్రయోజనాలపై దృష్టి సారిస్తాయని భావిస్తున్నాయి. అంతర్జాతీయ ఆర్థిక సంస్థలను సంస్కరించడానికి, వాణిజ్య, పెట్టుబడి సంబంధాలను బలోపేతం చేయడానికి, సుస్థిర అభివృద్ధి లక్ష్యాలను ముందుకు తీసుకెళ్లడానికి వర్ధమాన ఆర్థిక వ్యవస్థలకు బ్రిక్స్ ఒక కీలక వేదికగా రూపుదిద్దుకుంది.


**బ్రిక్స్ ఒక ప్రభావవంతమైన కూటమిగా ఆవిర్భావం**

ఇదిలా ఉండగా, బ్రెజిల్, రష్యా, ఇండియా, చైనా, దక్షిణాఫ్రికాలతో బ్రిక్స్ కూటమి ఏర్పాటైంది. అనంతరం, 2024లో ఈజిప్ట్, ఇథియోపియా, ఇరాన్, యూఏఈ, సౌదీ అరేబియాలను చేర్చుకోవడంతో ఇది మరింత విస్తరించింది. 2025లో ఇండోనేసియా కూడా ఇందులో చేరింది. గత సంవత్సరం బెలారస్, బొలీవియా, కజకిస్థాన్, క్యూబా, మలేషియా, నైజీరియా, థాయ్‌లాండ్, ఉగాండా, ఉజ్బెకిస్థాన్, వియత్నాం బ్రిక్స్ భాగస్వామ్య దేశాలుగా మారాయి. ప్రపంచంలోని 11 ప్రధాన వర్ధమాన ఆర్థిక వ్యవస్థలను ఒకచోట చేర్చిన ఈ కూటమి, ప్రపంచ జనాభాలో సుమారు 49.5 శాతం, ప్రపంచ జీడీపీలో సుమారు 40 శాతం, ప్రపంచ వాణిజ్యంలో సుమారు 26 శాతానికి ప్రాతినిధ్యం వహిస్తూ, ఒక ప్రభావవంతమైన కూటమిగా ఆవిర్భవించింది.

# బిహార్ ఒత్తిడి, బంగ్లా హక్కులు

## 30ఏళ్ల 'ఫరక్కా' ఒప్పందంపై కేంద్రం ఏం చేస్తుంది?

**వాస్తవదర్పణం, నేషనల్ డెస్క్:**



గంగానది నీటి పంపకాల విషయంలో భారత్, బంగ్లాదేశ్ మధ్య కీలకంగా మారిన ఫరక్కా ఒప్పందం ఇప్పుడు కేంద్ర ప్రభుత్వానికి కొత్త చిక్కులు తెచ్చిపెడుతోంది. ఒకవైపు బీజేపీకి కీలక మిత్రపక్షంగా ఉన్న జేడీయూ ఒప్పందాన్ని పునఃసమీక్షించాలని డిమాండ్ చేస్తోంది. మరోవైపు బంగ్లాదేశ్ మాత్రం తమకు దక్కాల్సిన గంగానది నీటిపై హక్కులను కాపాడాలని కోరుతోంది. దీంతో దేశీయ రాజకీయాలు, పొరుగు దేశంతో దౌత్య సంబంధాల మధ్య కేంద్రం ఇరుక్కున్న పరిస్థితి కనిపిస్తోంది.

**అసలు ఫరక్కా ఎందుకు నిర్మించారు?**

కోల్‌కతా పోర్టులో పేరుకుపోయే పూడికను తొలగించడంతో పాటు నౌకల రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చేయాలనే ఉద్దేశంతో గంగానది నీటిని హుగ్లీ నదికి మళ్లించేందుకు ఫరక్కా బ్యారేజీని నిర్మించారు. 1975లో ఇది అందుబాటులోకి వచ్చింది. ఫరక్కా దాటిన తర్వాత గంగానది బంగ్లాదేశ్‌లోకి ప్రవేశిస్తుంది. అక్కడ ఈ నదిని పద్మాగా పిలుస్తారు. అయితే ఫరక్కా వద్ద నీటిని హుగ్లీ వైపు మళ్లించడం వల్ల ఎండాకాలంలో బంగ్లాదేశ్‌కు చేరే నీటి పరిమాణం తగ్గిందనే అభ్యంతరాలు మొదలయ్యాయి. దీనివల్ల నీటి కొరతతో పాటు పర్యావరణ సమస్యలు కూడా తలెత్తాయని బంగ్లాదేశ్ చాలాకాలంగా చెబుతోంది. ఈ సమస్యకు పరిష్కారం కోసం భారత్, బంగ్లాదేశ్ మధ్య చర్చలు జరిగాయి. చివరకు 1996 డిసెంబర్ 12న అప్పటి భారత ప్రధాని హెచ్.డి. దేవెగౌడ, బంగ్లాదేశ్ ప్రధాని షేక్ హసీనా హయాంలో 30 ఏళ్ల గంగానది నీటి పంపకాల ఒప్పందం కుదిరింది. ఆ ఒప్పందం 2026 డిసెంబర్ 12తో ముగియనుంది. దీంతో ఇప్పుడు దాని పునరుద్ధరణపై చర్చ మొదలైంది.

**బిహార్‌కు ఎందుకు అభ్యంతరం?**

ఫరక్కా బ్యారేజీ విషయంలో బిహార్ ప్రభుత్వం మొదటి నుంచీ కొన్ని అభ్యంతరాలు వ్యక్తం చేస్తోంది. గంగానది ఫరక్కాకు చేరకముందే బిహార్ గుండా ప్రవహిస్తుంది. బ్యారేజీ కారణంగా నది సహజ ప్రవాహంలో మార్పులు రావడంతో పూడిక భారీగా పేరుకుపోతోందని బిహార్ వాదిస్తోంది. ఈ పూడిక కారణంగా గంగానది ప్రవాహ సామర్థ్యం తగ్గుతోందని, వర్షాకాలంలో వరదల తీవ్రత పెరుగుతోందని ఆ రాష్ట్రం చెబుతోంది. మరోవైపు ఎండాకాలంలో నీటి లభ్యత కూడా సమస్యగా మారుతోందని ఆందోళన వ్యక్తం చేస్తోంది. అంటే ఫరక్కా ప్రయోజనాలు ఒక ప్రాంతానికి దక్కుతుండగా, దాని ప్రభావాన్ని బిహార్ భరించాల్సి వస్తోందన్నది అక్కడి వాదన.

**జేడీయూ డిమాండ్ ఏంటి?**

బిహార్‌లో అధికార కూటమిలో కీలక భాగస్వామిగా ఉన్న జేడీయూ, ఫరక్కా ఒప్పందంపై శాస్త్రీయంగా పునఃసమీక్ష జరగాలని కోరుతోంది. పూడిక సమస్యను పరిష్కరించేందుకు దేశవ్యాప్తంగా ప్రత్యేక పూడిక నిర్వహణ విధానం తీసుకురావాలని డిమాండ్ చేస్తోంది. 1996లో ఒప్పందం కుదిరిన సమయంలో బిహార్ భవిష్యత్ అవసరాలను తగినంతగా పరిగణనలోకి తీసుకోలేదని జేడీయూ చెబుతోంది. ఇప్పుడు కొత్తగా ఒప్పందంపై చర్చలు జరిగితే.. అందులో బిహార్‌కు తప్పనిసరిగా భాగస్వామ్యం కల్పించాలని కోరుతోంది. ఇదే ఇప్పుడు కేంద్రానికి రాజకీయంగా కీలక అంశంగా మారింది. ఎందుకంటే బిహార్ అభ్యంతరాలను పూర్తిగా పక్కన పెట్టడం కూటమి రాజకీయాలపై ప్రభావం చూపే అవకాశం ఉంది.

**బంగ్లాదేశ్‌ను విస్మరించగలరా?**

అయితే కేంద్రం ఈ అంశాన్ని కేవలం దేశీయ రాజకీయాల కోణంలో చూడలేని పరిస్థితి ఉంది. బంగ్లాదేశ్‌లో లక్షలాది మంది ప్రజలు పద్మా నదిపై ఆధారపడి జీవిస్తున్నారు. వ్యవసాయం, మత్స్య సంపదతో పాటు అక్కడి జీవన విధానంలో ఈ నది కీలక పాత్ర పోషిస్తోంది. అందుకే గంగానది నీటి పంపకాల విషయంలో తమకు న్యాయమైన వాటా దక్కాలని బంగ్లాదేశ్ కోరుతోంది. భారత్ ఏకపక్షంగా నిర్ణయం తీసుకుంటే అది రెండు దేశాల మధ్య ఇప్పటికే ఉన్న సంబంధాలపై ప్రభావం చూపే అవకాశం ఉంది. ముఖ్యంగా షేక్ హసీనా ప్రభుత్వం తర్వాత భారత్‌బంగ్లాదేశ్ సంబంధాల్లో వచ్చిన మార్పుల నేపథ్యంలో ఈ అంశం మరింత సున్నితంగా మారింది. బంగ్లాదేశ్ భారత్‌కు దూరమైతే చైనా, పాకిస్థాన్‌లు అక్కడ తమ ప్రభావాన్ని పెంచుకునే అవకాశం ఉందన్న ఆందోళన కూడా ఉంది.

**కొత్త ఒప్పందమే పరిష్కారమా?**

అందుకే 1996 నాటి పరిస్థితులను, ఇప్పటి పరిస్థితులను ఒకేలా చూడలేం. అప్పటితో పోలిస్తే ఇప్పుడు వాతావరణ మార్పులు, వర్షపాతంలో మార్పులు, జనాభా పెరుగుదల, వ్యవసాయం తాగునీటి అవసరాలు వంటి అంశాలు మరింత కీలకంగా మారాయి. ఈ నేపథ్యంలో పాత ఒప్పందాన్ని యథాతథంగా కొనసాగించడం అంత సులభం కాదు. అదే సమయంలో ఒప్పందాన్ని పూర్తిగా రద్దు చేయడం కూడా భారత్‌కు దౌత్యపరంగా సమస్యలు తెచ్చిపెట్టే అవకాశం ఉంది. కాబట్టి బిహార్ ఆందోళనలను పరిగణనలోకి తీసుకోవడంతో పాటు బంగ్లాదేశ్ నీటి హక్కులకు భరోసా కల్పించేలా కొత్త విధానం రూపొందించాల్సిన అవసరం కనిపిస్తోంది. పూడిక సమస్య, వరదలు, ఎండాకాలపు నీటి లభ్యత, వాతావరణ మార్పులు వంటి అంశాలకు శాశ్వత పరిష్కారం చూపాల్సి ఉంటుంది.

# రోహిత్ వరల్డ్‌కప్ భవితవ్యంపై ఉత్కంఠ

- 'వచ్చే అక్టోబర్‌కు చాలా సమయం ఉంది.. అప్పుడే చూద్దాం'
- వరల్డ్‌కప్ సన్నద్ధతపై రోహిత్ ఆసక్తికర వ్యాఖ్యలు



వచ్చే ఏడాది వన్డే ప్రపంచకప్‌లో భారత మాజీ కెప్టెన్ రోహిత్ శర్మ ఆడతాడా? లేదా? అన్న ఉత్కంఠ కొనసాగుతోంది. లార్డ్స్ వన్డేలో శతకంతో మెరిసినప్పటికీ.. 40 ఏళ్ల వయసులో మెగా టోర్నీకి అతడిని ఎంపిక చేస్తారన్న గ్యారంటీ లేదు. ఈ నేపథ్యంలో తన వరల్డ్‌కప్ సన్నద్ధతపై రోహిత్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. వచ్చే ఏడాది అక్టోబర్‌కు ఇంకా చాలా సమయం ఉందని, ఇప్పుడే దాని గురించి ఆలోచించాల్సిన అవసరం లేదని కూల్‌గా చెప్పాడు. ఇదిలా ఉంటే.. బీసీసీఐ కార్యదర్శి దేవజిత్ సైకియా సైతం రోహిత్‌పై వస్తున్న ఊహాగానాలను కొట్టి పారేశాడు. "రోహిత్ గొప్పగా ఆడుతున్నాడు. మీకు ఇంకేం కావాలి? అతడి గురించి వస్తున్న వదంతులను నమ్మకండి" అని స్పష్టం చేశాడు. దీంతో ప్రస్తుతానికి వన్డే జట్టులో హిట్‌మ్యాన్‌కు చోటు ఉన్నట్టేనన్న సంకేతాలు వెలువడ్డాయి. ప్రపంచకప్ సమయానికి రోహిత్‌కు 40 ఏళ్లు వస్తుండటంతో యువ ఓపెనర్ యశస్వీ జైస్వాల్‌కు అవకాశం ఇవ్వాలన్న అభిప్రాయాలు కూడా ఉన్నాయి. అయితే మాజీ క్రికెటర్లు మాత్రం రోహిత్ అనుభవం జట్టుకు కీలకమని చెబుతున్నారు. స్వదేశంలో వెస్టిండీస్‌తో జరిగే వన్డే సిరీస్‌పై దృష్టి పెట్టిన హిట్‌మ్యాన్.. ప్రపంచకప్ బెర్త్ కోసం తన పోరాటాన్ని కొనసాగిస్తున్నాడు.



# తొలి టీ20 వాయిదా లేదు!

- బ్రిక్స్ సదస్సు నేపథ్యంలో భద్రతపై ఆందోళనలు
- షెడ్యూల్ ప్రకారమే భారత్–అఫ్గాన్ మ్యాచ్

భారత్-అఫ్గనిస్థాన్ టీ20 సిరీస్ తొలి మ్యాచ్‌పై నెలకొన్న ఉత్కంఠకు తెరపడింది. భద్రతా కారణాలతో మ్యాచ్‌ను వాయిదా వేయాలన్న ప్రతిపాదన తెరపైకి వచ్చినప్పటికీ.. సెప్టెంబర్ 13న ఢిల్లీలోని అరుణ్ జైట్లీ స్టేడియంలో మ్యాచ్ యథావిధిగా నిర్వహించనున్నట్లు ఢిల్లీ అండ్ డిస్ట్రిక్ట్ క్రికెట్ అసోసియేషన్ (డీడీసీఏ) స్పష్టం చేసింది. దేశ రాజధానిలో సెప్టెంబర్ 12, 13 తేదీల్లో బ్రిక్స్ సదస్సు జరగనున్న నేపథ్యంలో ట్రాఫిక్, భద్రతా ఏర్పాట్లపై ఆందోళనలు వ్యక్తమయ్యాయి. ట్రాఫిక్ పోలీసులు కూడా పలు మార్గాల్లో ఆంక్షలు, మళ్లింపులు ఉంటాయని ఇప్పటికే ప్రకటించారు. అయితే డీడీసీఏ, పోలీసుల మధ్య సమన్వయంతో మ్యాచ్‌కు అవసరమైన భద్రతా ఏర్పాట్లు చేయగలమని అధికారులు స్పష్టం చేశారు. బీసీసీఐ, ఏసీబీ ఇప్పటికే మూడు టీ20ల సిరీస్‌ను సెప్టెంబర్ 13, 15, 17 తేదీల్లో ఢిల్లీలో నిర్వహించేందుకు షెడ్యూల్ ప్రకటించాయి.



# ఈస్ట్ జోన్‌కు దులీప్ ట్రోఫీ!

- 13 ఏళ్ల తర్వాత టైటిల్..
- ఇషాన్ కిషన్‌కు ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్

దులీప్ ట్రోఫీలో ఈస్ట్ జోన్ చాంపియన్‌గా నిలిచింది. 13 ఏళ్ల తర్వాత టైటిల్‌ను సొంతం చేసుకుంది. సౌత్ జోన్‌తో జరిగిన ఫైనల్లో తొలి ఇన్నింగ్స్ ఆధిక్యంతో ఈస్ట్ జోన్‌ను విజయం వరించింది. ఐదో రోజు రెండో ఇన్నింగ్స్‌లో 7 వికెట్లకు 388 పరుగుల వద్ద డిక్లేర్ చేసిన ఈస్ట్ జోన్.. మొత్తం 760 పరుగుల ఆధిక్యంలో నిలిచింది. అనంతరం ఇరు జట్ల కెప్టెన్లు డ్రాకు అంగీకరించడంతో ఈస్ట్ జోన్ విజేతగా నిలిచింది. రెండో ఇన్నింగ్స్‌లో మొహమ్మద్ కౌనియాన్ ఖురేషీ 116 పరుగులతో నాటౌట్‌గా నిలిచి సెంచరీ చేశాడు. తొలి ఇన్నింగ్స్‌లో ఈస్ట్ జోన్ 708 పరుగులు చేయగా.. సౌత్ జోన్ 336 పరుగులకే ఆలౌటైంది. ఈస్ట్ జోన్ కెప్టెన్ ఇషాన్ కిషన్ రెండు ఇన్నింగ్స్‌ల్లో కలిపి 350 పరుగులు (270, 80) చేసి ఫైనల్లో కొత్త రికార్డు నెలకొల్పాడు. అతడికి ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్ అవార్డు దక్కింది. సౌత్ జోన్ కెప్టెన్ తిలక్ వర్మకు ప్లేయర్ ఆఫ్ ద సిరీస్ పురస్కారం లభించింది. ఇది ఈస్ట్ జోన్‌కు మూడో దులీప్ ట్రోఫీ టైటిల్.



# యశ్ ఠాకూర్‌కు పిలుపు

- హర్షిత్ రాణా స్థానంలో ఎంపిక
- బుమ్రా, నితీశ్, సుందర్‌కు ఫిట్‌నెస్ క్లియరెన్స్

అఫ్గనిస్థాన్‌తో టీ20 సిరీస్‌తో పాటు ఆసియా క్రీడల టీ20 జట్టులోకి విదర్భ ఫాస్ట్‌బౌలర్ యశ్ ఠాకూర్‌ను ఎంపిక చేశారు. గాయంతో బెంగళూరులోని బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో చికిత్స పొందుతున్న హర్షిత్ రాణా స్థానంలో అతడికి అవకాశం దక్కింది. 27 ఏళ్ల యశ్ ఇటీవల జింబాబ్వే పర్యటనలో రెండు మ్యాచ్‌ల్లో నాలుగు వికెట్లు పడగొట్టాడు. సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీలో 50 మ్యాచ్‌లు ఆడి 81 వికెట్లు తీసుకున్నాడు. మరోవైపు స్టార్ పేసర్ జస్ప్రీత్ బుమ్రాకు ఫిట్‌నెస్ క్లియరెన్స్ లభించింది. దీంతో అఫ్గనిస్థాన్‌తో మూడు టీ20ల సిరీస్‌లో అతడు బరిలోకి దిగనున్నాడు. బుమ్రాతో పాటు నితీశ్ కుమార్ రెడ్డి, వాషింగ్టన్ సుందర్‌కు కూడా ఫిట్‌నెస్ క్లియరెన్స్ లభించింది. సెప్టెంబర్ 13 నుంచి భారత్-అఫ్గనిస్థాన్ టీ20 సిరీస్ ప్రారంభం కానుంది.

## లైఫ్ స్టైల్ LYFE STYLE



# వెజ్, నాన్ వెజ్ లో ఉండే ఐరన్ భిన్నంగా ఉంటుంది

శరీరంలో హిమోగ్లోబిన్ తయారవ్వడానికి ఐరన్ ఎంతో అవసరమైన పోషకం. శరీరానికి తగినంత ఐరన్ అందకపోయినా, అందిన ఐరన్ సరిగ్గా శోషించకపోయినా ఐరన్ లోపం, రక్తహీనత వంటి సమస్యలు ఏర్పడతాయి. దీంతో తరచూ అలసట, నీరసం, తల తిరగడం, శారీరక శ్రమ చేసినప్పుడు త్వరగా అలసిపోవడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. తక్కువ ఖర్చుతో ఐరన్ అందించే ఆహారాల కోసం చూస్తున్నవారికి మునగ ఆకులు, మసూర్ పప్పు వంటి వాటిని ఆహారంలో చేర్చుకోవాలి. అయితే ఐరన్ అధికంగా ఉన్న ఆహారం తీసుకోవడం మాత్రమే సరిపోదు. అందులోని ఐరన్‌ను శరీరం ఎంతమేర శోషించుకుంటుందనేది కూడా ముఖ్యమే. మొక్కల ఆధారిత ఆహారాల్లో ప్రధానంగా నాన్‌హీమ్ ఐరన్ ఉంటుంది. ఇది మాంసాహార ఆహారాల్లో లభించే హీమ్ ఐరన్‌తో పోలిస్తే శరీరంలో తక్కువగా శోషణకు గురవుతుంది. అందుకే కేవలం ఐరన్ ఎక్కువగా ఉన్న ఆహారాన్ని ఎక్కువ మోతాదులో తీసుకోవడం వల్ల రక్తంలో ఐరన్ స్థాయిలు తప్పనిసరిగా పెరుగుతాయని చెప్పలేమని నిపుణులు చెబుతున్నారు. మునగ ఆకులు, మసూర్ పప్పు వంటి చవకైన ఆహారాలు ఐరన్‌ను అందించగలిగినా, వాటిని సరైన ఆహారాలతో కలిపి తీసుకోవడం ద్వారా శరీరానికి మరింత ప్రయోజనం కలిగే అవకాశం ఉంటుంది.

### విటమిన్ సి ముఖ్యం..

నాన్‌హీమ్ ఐరన్ శోషణను మెరుగుపరచడానికి విటమిన్ సి అధికంగా ఉండే ఆహారాలను ఐరన్ ఉన్న పదార్థాలతో కలిపి తీసుకోవడం సులభమైన మార్గాల్లో ఒకటి. నిమ్మకాయ, ఉసిరికాయ, జామపండు, నారింజ, టమాటా వంటి వాటిలో విటమిన్ సి సమృద్ధిగా ఉంటుంది. ఉదాహరణకు మసూర్ పప్పు లేదా మునగ ఆకులతో చేసిన వంటకంలో కొద్దిగా నిమ్మరసం కలపడం, లేదా ఆహారంతో పాటు విటమిన్ సి అధికంగా ఉండే పండ్లను తీసుకోవడం ద్వారా ఐరన్ శోషణకు సహాయపడతాయి. అయితే ఐరన్ అధికంగా ఉండే భోజనంతోపాటు టీ లేదా కాఫీ తీసుకోవడం మాత్రం తగ్గించాలి. టీ, కాఫీలో ఉండే కొన్ని సమ్మేళనాలు ముఖ్యంగా మొక్కల నుంచి లభించే నాన్‌హీమ్ ఐరన్ శోషణకు ఆటంకం కలిగిస్తాయి. కాబట్టి ఐరన్ ఉన్న ప్రధాన భోజనానికి దగ్గరగా టీ, కాఫీ తాగకుండా ఉండటం మంచిది. రక్తకణాల ఆరోగ్యానికి ఐరన్ ఒక్కటే సరిపోదు. శరీరానికి తగినంత ప్రోటీన్, ఫోలిక్ యాసిడ్, విటమిన్ బి12తో పాటు ఇతర ముఖ్యమైన పోషకాలు కూడా అవసరం. ముఖ్యంగా ఎర్ర రక్తకణాల తయారీ, వాటి పనితీరు సక్రమంగా ఉండేందుకు వివిధ రకాల పోషకాలు అవసరమవుతాయి. అందువల్ల పప్పులు, కూరగాయలు, పండ్లు, సంపూర్ణ ధాన్యాలు, పాలు లేదా ఇతర అనుకూలమైన ప్రోటీన్ వనరులతో కూడిన సమతుల్య ఆహారం తీసుకోవడం ముఖ్యం.

### మునగ ఆకులు, మసూర్ పప్పు..

మునగ ఆకులు, మసూర్ పప్పు వంటి ఆహారాలు ఆరోగ్యకరమైన ఆహారంలో భాగంగా ఐరన్‌ను అందించడంలో సహాయపడతాయి. అయితే ఇప్పటికే రక్తహీనత ఉన్నవారు వీటినే చికిత్సగా భావించకూడదు. ఐరన్ లోపానికి ఆహారంలో ఐరన్ తక్కువగా ఉండటం ఒక్కటే కారణం కాదు. శరీరం ఐరన్‌ను సరిగ్గా శోషించుకోకపోవడం లేదా ఎక్కడైనా రక్తస్రావం జరగడం వంటి ఇతర కారణాల వల్ల కూడా ఐరన్ లోపం ఏర్పడుతుంది. ఐరన్ లోపం పదేపదే రావడం లేదా కారణం తెలియకుండా కొనసాగడం కనిపిస్తే జీర్ణవ్యవస్థకు సంబంధించిన సమస్యలను కూడా పరిశీలించాల్సి ఉంటుంది. గ్యాస్ట్రైటిస్, సీలియాక్ వ్యాధి, ఇన్‌ఫ్లమేటరీ బవెల్ డిసీజ్, పెప్టిక్ అల్సర్ లేదా జీర్ణవ్యవస్థలో దీర్ఘకాలిక రక్తస్రావం వంటి సమస్యలు ఐరన్ లోపానికి కారణమయ్యే అవకాశం ఉంటుంది. అందువల్ల రక్తంలో ఐరన్ స్థాయిలు తరచూ తగ్గుతున్నప్పుడు కేవలం ఐరన్ ఉన్న ఆహారం తినడం మీదే ఆధారపడకుండా అసలు కారణాన్ని గుర్తించడం అవసరం. ఆహారం శరీరానికి అవసరమైన పోషకాలను అందించి రక్తహీనత నుంచి కోలుకునే ప్రక్రియకు సహాయపడుతుంది. అయితే తీవ్రమైన లేదా ఇప్పటికే నిర్ధారణ అయిన రక్తహీనత ఉన్నప్పుడు ఆహారంలో మార్పులు చేయడం మాత్రమే సరిపోదు. హిమోగ్లోబిన్ లేదా ఫెరిటిన్ స్థాయిలు గణనీయంగా తగ్గిన సందర్భాల్లో ఐరన్ సప్లిమెంట్లు అవసరమయ్యే అవకాశం ఉంది. రక్త పరీక్షల ఫలితాలు, ఐరన్ లోపం తీవ్రత, దానికి కారణం, వ్యక్తి మొత్తం ఆరోగ్య పరిస్థితిని బట్టి చికిత్స నిర్ణయించాలి. అందువల్ల వైద్యుల సలహా లేకుండా ఐరన్ సప్లిమెంట్లను స్వయంగా తీసుకోవడం మంచిది కాదు.

### నిమ్మకాయ లేదా టమాటా..

ఆహారం ద్వారా ఐరన్‌ను మెరుగ్గా పొందాలనుకునేవారు మునగ ఆకులు, మసూర్ పప్పు వంటి పదార్థాలకు నిమ్మకాయ లేదా టమాటాను జోడించాలి. భోజనంలో ఉసిరికాయ, జామపండు లేదా నారింజ వంటి విటమిన్ సి ఉన్న పండ్లను చేర్చుకోవచ్చు. ఐరన్ అధికంగా ఉన్న భోజనంతోపాటు వెంటనే టీ లేదా కాఫీ తీసుకోకుండా ఉండటం కూడా ఉపయోగకరంగా ఉంటుంది. అదే సమయంలో ప్రోటీన్, ఫోలేట్, విటమిన్ బి12 వంటి ఇతర పోషకాలు కూడా ఆహారంలో ఉండేలా చూసుకోవాలి. మునగ ఆకులు, మసూర్ పప్పుతో తయారు చేసిన సూప్ వంటి వంటకాలు సమతుల్య ఆహారంలో మంచి పోషకాహారంగా ఉపయోగపడతాయి. ముఖ్యంగా వీటితోపాటు విటమిన్ సి ఉన్న పదార్థాలను తీసుకుంటే ఐరన్ శోషణకు సహాయపడతాయి. అయితే తీవ్రమైన, పదేపదే వచ్చే లేదా కారణం తెలియని ఐరన్ లోపం ఉన్నప్పుడు కేవలం ఆహారంతోనే సమస్యను పరిష్కరించుకోవాలని ప్రయత్నించకూడదు. అవసరమైన పరీక్షలు చేయించుకుని, ఐరన్ లోపానికి అసలు కారణాన్ని గుర్తించి తగిన చికిత్స తీసుకోవడం చాలా ముఖ్యం.



## ‘అ’ బ్లడీ హంగర్

# గ్లింప్స్ విడుదల!

### అక్టోబర్ 9న థియేటర్లలోకి డార్క్ థ్రిల్లర్

హీరో రాహుల్ విజయ్, అర్చన అయ్యర్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ‘AH’ (అ) సినిమాపై ఇప్పటికే మంచి అంచనాలు నెలకొన్నాయి. ఇటీవల అడివి శేష్ విడుదల చేసిన టైటిల్, ఫస్ట్ లుక్‌కు మంచి స్పందన లభించగా.. తాజాగా చిత్రబృందం ‘బ్లడీ హంగర్’ పేరుతో ఫస్ట్ గ్లింప్స్‌ను విడుదల చేసింది. డెబ్యూ ప్రొడక్షన్ హౌస్‌లు స్టార్ బాక్స్ స్టోరీస్, రిపుల్ స్లైడ్ స్టూడియోస్ బ్యానర్లపై తెరకెక్కుతున్న ఈ చిత్రానికి సాయి బాలి దర్శకత్వం వహిస్తున్నారు. కనకరావు తొనంగి, అభిషేక్ కె, ఎడిటర్ గ్యారీ BH నిర్మాతలుగా వ్యవహరిస్తున్నారు. ఈ సినిమా 2026 అక్టోబర్ 9న థియేటర్లలో విడుదల కానుంది. డైలాగ్స్ లేకుండా రూపొందించిన గ్లింప్స్ భయానక విజువల్స్, ఉత్కంఠభరితమైన కథనంతో ఆకట్టుకుంటోంది. పలువురు యువతుల అదృశ్యానికి సంబంధించిన దర్యాప్తు చుట్టూ కథ సాగనున్నట్లు తెలుస్తోంది. అదే సమయంలో చీకటిలో పనిచేసే ఓ మిస్టీరియస్ శక్తిని కూడా గ్లింప్స్‌లో పరిచయం చేశారు. ‘అమ్మాయి.. అదృశ్యం.. అన్వేషణ’ అనే పదాలతో సినిమా ఇన్వెస్టిగేషన్ నేపథ్యంలో సాగనుందని ఆసక్తి పెంచారు. శ్రీచరణ్ పాకాల అందించిన బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ గ్లింప్స్‌లోని భయానక వాతావరణాన్ని మరింత బలపరిచింది. రాహుల్ విజయ్‌ను సీనియర్ పోలీస్ ఆఫీసర్‌గా చూపించారు. ఇన్వెస్టిగేషన్ సన్నివేశాల్లో ఆయన స్క్రీన్ ప్రెజెన్స్ ఆకట్టుకుంటోంది. అర్చన అయ్యర్‌కు సంబంధించిన సన్నివేశాలు కథలోని మిస్టరీని మరింత పెంచుతున్నాయి. చివర్లో వచ్చే చిల్లింగ్ రివీల్ సినిమాపై ఆసక్తిని మరింత పెంచింది. మోనిష్ భూపతి రాజు సినిమాటోగ్రఫీ అందించగా, అభినవ్ వి. కునపరెడ్డి, గ్యారీ BH ఎడిటింగ్ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. మిస్టరీ, ఎమోషన్, ఉత్కంఠభరితమైన సన్నివేశాలతో రూపొందుతున్న ‘అ’ డార్క్ థ్రిల్లర్‌గా ప్రేక్షకుల ముందుకు రానుంది. అక్టోబర్ 9, 2026న ఈ సినిమా థియేటర్లలో విడుదల కానుంది.



# బాలీవుడ్‌పై శ్రీలీల ఫోకస్!

టాలీవుడ్‌లో ఒకప్పుడు వరుస అవకాశాలతో దూసుకెళ్లిన శ్రీలీల కెరీర్ ప్రస్తుతం కాస్త నెమ్మదించినట్లు కనిపిస్తోంది. డ్యాన్స్, గ్లామర్, స్క్రీన్ ప్రెజెన్స్‌తో మంచి క్రేజ్ సంపాదించు కున్న ఆమెకు ఆశించిన స్థాయిలో విజయాలు దక్కకపోవడంతో అవకాశాలు తగ్గినట్లు ఇండస్ట్రీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఈ నేపథ్యంలో శ్రీలీల తన కెరీర్‌ను బాలీవుడ్‌లో కొనసాగించేందుకు ఫోకస్ పెంచినట్లు సమాచారం. వైద్య విద్యను పూర్తి చేసిన ఆమె ప్రస్తుతం పూర్తిస్థాయిలో సినిమాలపై దృష్టి పెట్టినట్లు తెలుస్తోంది. ఇప్పటికే ముంబైకి మకాం మార్చినట్లు ప్రచారం జరుగుతుండగా.. అక్కడే ఉంటూ హిందీ చిత్ర పరిశ్రమలో వరుస అవకాశాల కోసం ప్రయత్నిస్తున్నట్లు టాక్. ప్రస్తుతం కార్తీక్ ఆర్యన్ సరసన ఓ హిందీ చిత్రంలో నటించేందుకు సిద్ధమవుతున్న శ్రీలీల.. ఈ సినిమాతో బాలీవుడ్‌లో తన అదృష్టాన్ని పరీక్షించుకోనుంది. ఇకపై సౌత్ సినిమాల కంటే హిందీ చిత్రాలకే ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వబోతున్నారనే ప్రచారం సినీ వర్గాల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది.



## ‘హైకూ’ క్యూట్ లవ్‌స్టోరీ

విజన్ సినిమా హౌస్ బ్యానర్‌పై ఏగన్, శ్రీదేవి జంటగా నటిస్తున్న రొమాంటిక్ ఎంటర్‌టైనర్ ‘హైకూ’ టీజర్‌ను హీరో హరీష్ కళ్యాణ్ విడుదల చేశారు. కలర్‌ఫుల్ విజువల్స్, ఆహ్లాదకరమైన రొమాంటిక్ సన్నివేశాలు, యూత్‌ఫుల్ ట్రీట్‌మెంట్‌తో టీజర్ ఆకట్టుకుంటోంది. ఏగన్, శ్రీదేవి మధ్య కెమిస్ట్రీ సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలవగా.. టీజర్ చివర్లో ఫెమినా జార్జ్ ఎంట్రీ ఆసక్తిని పెంచుతోంది. సిద్ధు కుమార్ అందించిన మెలోడీ మ్యూజిక్, ఫ్రెష్ విజువల్స్ ప్రేమకథకు మరింత అందాన్ని తీసుకొచ్చాయి. యువరాజ్ చిన్నసామి రచన, దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రాన్ని డా. డి. అరుళానందు, మాథ్యూ అరుళానందు నిర్మిస్తున్నారు. ప్రియేష్ గురుస్వామి సినిమాటోగ్రఫీ, శక్తి ప్రణేష్ ఎడిటింగ్ అందిస్తున్నారు. షూటింగ్ పూర్తికాకముందే ‘హైకూ’ డిజిటల్ హక్కులను నెట్‌ఫ్లిక్స్ సొంతం చేసుకోవడం సినిమాపై అంచనాలను మరింత పెంచుతోంది.



## వృషకర్మకు

# అసలు పని ఇప్పుడే!

### డిసెంబర్ 4న రిలీజ్.. నాగచైతన్య లుక్‌తో పెరిగిన ఆసక్తి

నాగచైతన్య హీరోగా కార్తీక్ దండు దర్శకత్వంలో తెరకెక్కుతున్న ‘వృషకర్మ’ డిసెంబర్ 4న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇప్పటికే చైతూ తన షూటింగ్ భాగాన్ని పూర్తి చేయగా.. ఇప్పుడు చిత్రబృందం పూర్తిగా పోస్ట్ ప్రొడక్షన్, ముఖ్యంగా వీఎఫ్‌ఎక్స్ పనులపై దృష్టి పెట్టింది. మైథాలజీ, మిస్టరీ, అడ్వెంచర్ అంశాలతో రూపొందుతున్న ఈ సినిమాలో భారీ స్థాయిలో గ్రాఫిక్స్ ఉండనున్నాయి. తాజాగా విడుదలైన నాగచైతన్య పోస్టర్ కూడా ఆసక్తిని పెంచుతోంది. చేతిలో ఆయుధంతో, మైథాలజీ టచ్ ఉన్న లుక్‌లో చైతూ ఇప్పటివరకు కనిపించని సరికొత్త అవతార్‌లో కనిపిస్తున్నాడు. ‘విరూపాక్ష’తో హారర్, మిస్టరీని ఆకట్టుకునేలా తెరకెక్కించిన కార్తీక్ దండు.. ఈసారి మరింత భారీ కాన్వాస్‌తో ‘వృషకర్మ’ను రూపొందిస్తున్నాడు. సుకుమార్ రైటింగ్స్ భాగస్వామ్యం కావడంతో సినిమాపై అంచనాలు పెరుగుతున్నాయి. అంతర్జాతీయ స్థాయి వీఎఫ్‌ఎక్స్‌తో పాన్ ఇండియా స్థాయిలో చిత్రాన్ని సిద్ధం చేస్తున్నారు. మీనాక్షి చౌదరి కథానాయికగా నటిస్తుండగా, స్పర్శ్ శ్రీవాస్తవ కీలక పాత్రలో కనిపించనున్నారు. అజనీష్ లోక్‌నాథ్ సంగీతం అందిస్తున్న ఈ చిత్రాన్ని బీవీఎస్ఎన్ ప్రసాద్ నిర్మిస్తున్నారు.

Printed and Published by Editor **MD. ZAKRIA**, on behalf of QSS PUBLICATION(Owner: Abdul Sattar), Printed at: S.No: 3-8-124/8, New Bharath Printers, Ramanthapur Main Road, Hyderabad – 13. Published From: 3-7-1, Indira Nagar, Ramanthapur, Hyderabad – 500 013. Ph: 9391926119. RNI NO : APTEL/2013/54511.